


సంపత్ వినాయక్ ఆలయం రోడ్డు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025



మాస్టర్ ప్లాన్‌లో మార్పులు

వీఎంఆర్‌డీఏ కసరత్తు

- అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- భీమిలి బీచ్ రోడ్డులో అడ్డగోలు అలైన్‌మెంట్‌కు చెక్
- రాడీసన్ బ్లూ హోటల్, ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌ల వద్ద మార్పులు
- దసపల్లా హిల్స్‌లోను...
- పార్క్ హోటల్ నుంచి దత్ ఐల్యాండ్ వరకూ ప్రతిపాదించిన మేరకు రహదారి విస్తరణ
- దత్ ఐల్యాండ్-తెలుగుతల్లి ఫ్లైఓవర్ మార్గంలో మెట్రో రైల్వే స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనలు అందిన తరువాత నిర్ణయం
- పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి, ఎలమంచిలిల్లో కొత్త రహదారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మాస్టర్ ప్లాన్-2041లో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వైసీపీ హయాంలో రూపుదిద్దుకున్న ఈ ప్లాన్‌లో అనేకచోట్ల ఆ పార్టీ నాయకులకు అనుకూలంగా రహదారులు డిజైన్ చేశారు. దానిపై విమర్శలు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం అభ్యంతరాలు స్వీకరించి, వాటికి మార్పులు చేపడుతోంది. దీనివల్ల అనేక మంది సామాన్య ప్రజలకు మేలు జరగనున్నది.



రుషికొండ వద్ద గల రాడిసన్ బ్లూ హోటల్

రాడిసన్ బ్లూ హోటల్ వద్ద...

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు ఆరు వరుసల బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. ఈ మార్గాన్ని 200 అడుగులకు విస్తరించాలనేది యోచన. అయితే కొన్నిచోట్ల 100 అడుగులు, మరికొన్నిచోట్ల 120, ఇంకొన్నిచోట్ల 150 అడుగులు ప్రతిపాదించారు. ఒకేవిధంగా అలైన్‌మెంట్ చేయలేదు. అంతేకాకుండా రహదారి విస్తరణ చేస్తే ఇరువైపులా సమానంగా ఉండాలి. కానీ నాటి వైసీపీ నేతలు వారి భాగస్వాములకు మేలు చేకూర్చేందుకు వారి నిర్మాణాల వైపు విస్తరణ లేకుండా చేశారు. ఇలా సాగర్‌నగర్ దాటిన తరువాత వచ్చే రాడిసన్ బ్లూ హోటల్‌కు నష్టం జరగకుండా విస్తరణ అంతా ఎదురుగా ఉన్న భూముల వైపు ప్రతిపాదించారు. దీనిపై పెద్దఎత్తున ఆరోపణలు, అభ్యంతరాలు రావడంతో అధికారులు దానిని ఇప్పుడు సరి చేస్తున్నారు. ఆ హోటల్ ముందు సుమారుగా 20 అడుగుల వెడల్పున ఫుట్‌పాత్ ఏరియా ఉంది. అక్కడి వరకూ రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. అంటే హోటల్ ప్రహరీ గోడ వరకూ రోడ్డు వస్తుంది.

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2041ను రెండు దశాబ్దాల అవసరాల కోసం వైసీపీ హయాంలో తయారుచేశారు. వైసీపీ నాయకుల్లో అత్యధికులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉండడం, వారి సానుభూతిపరులకు కూడా భారీగా భూములు ఉండడంతో వారికి లబ్ధి చేకూరేలా మాస్టర్ ప్లాన్ రహదారులు డిజైన్ చేశారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో మిగిలినవారు ఆర్థికంగా నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై అప్పట్లోనే ... మిగతా 8వ పేజీలో

10 జీవీఎంసీలో జోన్‌లు



నియోజకవర్గంలోని వార్డులన్నీ ఒకే జోనల్ కార్యాలయంలోకి...

- పెందుర్తి, భీమిలి నియోజకవర్గాల్లో రెండేసి...
- జీవీఎంసీ ప్రతిపాదనకు రాష్ట్రప్రభుత్వం ఆమోదం
- అక్టోబరు మొదటివారంలో అధికారిక ఉత్తర్వులు?
- కొత్తజోన్‌లకు ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్‌ఓడీలకు కమిషనర్ ఆదేశం
- భవనాలు ఎంపిక, సిబ్బంది, ఫర్నీచర్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టీకరణ



కొత్తగా ఏర్పాటయ్యే జోన్‌లలోకి వచ్చే వార్డులు :

భీమిలి జోన్-1: 1, 2, 3, 4	పశ్చిమ జోన్: 40,52,56,57,58, 59, 60,61,62,63,89,90, 91,92
భీమిలి జోన్-2: 5, 6, 7, 8, 98	పెందుర్తి జోన్-1: 88,93,94,95, 96,97
తూర్పుజోన్: 9,10,11,12,13, 14,15,16,17,18, 19,20, 21,22,23,28	గాజువాక జోన్: 64,65,66,67,68, 69, 70,71,72,73,74,75, 76,86, 87
ఉత్తర జోన్: 14,24,25,26,42, 43,44,45,46,47,48,49,50, 51,53,34,55	పెందుర్తి జోన్-2: 77,78,79,85
దక్షిణ జోన్: 27,29,30,31,32, 33, 34,35,36,37,38,39,41	అనకాపల్లి జోన్: 80,81,82,83,84

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఇప్పటివరకూ ఎనిమిది జోన్‌లు ఉండగా, ఇకపై పది కానున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం నియోజకవర్గానికి ఒక జోన్ ఉండేలా అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. విస్తీర్ణం రీత్యా భీమిలి, పెందుర్తి నియోజకవర్గాలకు రెండేసి జోన్‌లు, మిగిలిన నియోజకవర్గాలకు ఒక్కో జోన్ ఉండేలా అధికారులు పంపిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు తెలిసింది. మంగళవారం అమరావతి వెళ్లిన జీవీఎంసీ కమిషనర్, చీఫ్ సిటీప్లానర్‌లకు ప్రభుత్వ పెద్దలు మౌఖికంగా ఈ విషయం చెప్పారు. అక్టోబరు మొదటివారంలోగా అధికారిక ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉంది.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం ఎనిమిది జోన్‌లు ఉన్నాయి. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌గా ఉన్నప్పుడు ఆరు జోన్‌లు ఉండగా, భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీల విలీనం తర్వాత గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)గా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఎనిమిది జోన్‌లుగా పాలనసాగుతోంది. అధికారులు భౌగోళిక పరిస్థితులను ప్రామాణికంగా తీసుకుని జోన్‌లను విభజించారు. అందువల్ల ఒక జోన్ పరిధి ప్రస్తుతం రెండు, మూడు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ఉదాహరణకు తూర్పు నియోజకవర్గ పరిధిలో ఉన్న 9, 10, 11, 12, 13 వార్డులు ప్రస్తుతం జోన్-2 (మధురవాడ)లో ఉన్నాయి. జోన్-2లో అధిక భాగం భీమిలి నియోజకవర్గం ఉంది. అలాగే ఉత్తర నియోజకవర్గ పరిధిలో ఉన్న 14, 24, 25, 26 వార్డులు జోన్-3 (ఆశీల్‌మెట్ట)లో ఉన్నాయి. జోన్-3లో అత్యధిక భూభాగం తూర్పు నియోజకవర్గ పరిధిలో ఉంది. దీనివల్ల ఆయా వార్డులకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర సమస్యలపై సమావేశం ఏర్పాటుచేయాలనుకుంటే రెండు, మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతోపాటు రెండు, మూడు జోన్‌ల అధికారులను పిలవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆ సమావేశానికి ఏదో కారణం చేత ఏ ఒక్క అధికారిగానీ, ఎమ్మెల్యేగానీ హాజరుకాకపోతే కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఒక నియోజకవర్గ పరిధిలోని వార్డులన్నీ కలిపి ఒకే జోన్‌లో ఉంటే పాలనాపరంగా తలెత్తుతున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అధికారులు చాలాకాలంగా అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం ప్రజా ప్రతినిధుల వద్ద పలుమార్లు ప్రస్తావించారు. ఇటీవల ... మిగతా 8వ పేజీలో



ధనలక్ష్మిగా కనకమహాలక్ష్మి దర్శనం

మహారాణిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం ధనలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష చామంతి పూలతో అర్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం అమ్మవారిని ధాన్యలక్ష్మిగా అలంకరిస్తారు. లడ్డూలతో సహస్ర నామార్చన జరుగుతుంది.

అమరావతికి నూతన ఉపాధ్యాయులు

- ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో భోజన ఏర్పాట్లు చేసిన అధికారులు



నక్కపల్లిలో భోజనాలు చేస్తున్న నూతన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు

ఉక్కు టౌన్‌షిప్/నక్కపల్లి/ఎస్.రాయవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు గురువారం అమరావతిలో ప్రభుత్వం నిర్వహించే అభినందన సభలో పాల్గొనేందుకు బుధవారం విశాఖ నుంచి బస్సుల్లో బయలుదేరారు. సుమారు మూడు వేల మంది కోసం అధికారులు 80 బస్సులను సమకూర్చారు. ఉదయం ఉక్కు టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయం వద్ద నుంచి బయలుదేరిన వారు మధ్యాహ్నానికి ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలకు చేరుకున్నారు. ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు తిమ్మాపురంలోని ఆదర్శ స్కూల్లో 450 మంది నూతన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు 450 కలిపి మొత్తం 900 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా నక్కపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సుమారు రెండు వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. విద్యా శాఖ ఆర్‌జేడీ బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు, విశాఖపట్నం డీఈవో ప్రేమకుమార్ ఆయా విద్యా సంస్థల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇంజనీరింగ్ సీట్లు.. విద్యార్థుల పాట్లు

తొలి రెండు విడతల కౌన్సెలింగ్‌లో సీట్లు రాని పలువురికి మూడో విడతలో కేటాయింపు

- మరోవిడత కౌన్సెలింగ్ ఉంటుందని తెలియక మేనేజ్‌మెంట్ కోటాలో చేరేందుకు సిద్ధమైన కొందరు విద్యార్థులు
- కాలేజీల యాజమాన్యాలకు అడ్వాన్స్‌ల చెల్లింపు
- ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా అందజేత
- ...ఇప్పుడు అవి వెనక్కి ఇచ్చేందుకు ససేమిరా
- అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"ఎంవీపీ కాలనీకి చెందిన శ్వేత ఈసీఈలో చేరాలని భావించింది. ఈ మేరకు కౌన్సెలింగ్‌లో ప్రముఖ కాలేజీలను ఎంపిక చేసుకుంది. రెండు విడతలు కౌన్సెలింగ్ పూర్తయ్యే సమయానికి సీటు రాకపోవడంతో ముందుజాగ్రత్త చర్యగా ఎంపిక చేసుకున్న ఒక కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటాలో చేరేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఏడాదికి రూ.1.8 లక్షలు చొప్పున ఫీజు చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. సీటు కన్ఫార్మ్ చేసుకునేందుకు తొలి విడత రూ.40 వేలు చెల్లించింది. ఒరిజనల్ సర్టిఫికెట్లను యాజమాన్యానికి ఇచ్చింది. అయితే ఇటీవల నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్‌లో శ్వేతకు ప్రముఖ కాలేజీలో ఈసీఈ సీటు వచ్చింది. మేనేజ్‌మెంట్ కోటాలో సీటు ఇచ్చేందుకు సర్టిఫికెట్లు తీసుకున్న కాలేజీ యాజమాన్యం...ఒక పట్టాన వాటిని తిరిగి ఇవ్వలేదు. దీంతో శ్వేత ఏడాది ఫీజు (రూ.1.8 లక్షలు)ను చెల్లించి తన సర్టిఫికెట్లను తీసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎంతోమంది విద్యార్థులు ఇదే ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు."

ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీకి రెండు విడతల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీట్లు రాని ఎంతోమంది విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటాలో చేరేందుకు కాలేజీల యాజమాన్యాలతో మాట్లాడు కున్నారు. అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లిం చడంతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇచ్చేశారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో పెద్ద సంఖ్యలో సీట్లు మిగిలిపోవడంతో ఉన్నత విద్యా మండలి మూడో విడత కౌన్సెలింగ్‌ను నిర్వ హించింది. మొదటి రెండు విడతల్లో నిర్వ హించిన కౌన్సెలింగ్‌లో సీట్లు రాని ఎంతోమంది విద్యార్థులు మూడో విడత కౌన్సెలింగ్‌లో తాము కోరుకున్న కాలేజీల్లో, నచ్చిన బ్రాంచీల్లో సీట్లు దక్కించుకున్నారు.అయితే అప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో చేరేందుకు సిద్ధమైన విద్యార్థులకు కొత్త చిక్కు వచ్చిపడింది. కన్వీనర్ కోటాలో సీట్లు రాలేదన్న ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ కోటాలో చేరే క్రమంలో ఎంతోమంది ఆయా కాలేజీలకు కొంత మొత్తం ఫీజును అడ్వాన్స్‌గా చెల్లించడంతోపాటు సర్టిఫికెట్లను ఇచ్చేశారు. ఇప్పుడు కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయని చెప్పి ఆయా కాలేజీలకు వెళ్లి సర్టిఫికెట్లు అడుగుతుంటే ఇచ్చేందుకు యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో చేరి, ఇప్పుడు వేరొకచోట సీటు వచ్చిందని వెళ్లిపోతే తాము నష్టపోతామని వాదిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కాలేజీల ... మిగతా 8వ పేజీలో

గుర్రంపాలెంలో అక్రమ క్వారీయింగ్

ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్విన సంస్థలు

- గనుల శాఖ నోటీసులు ఇచ్చినా కనీసం వివరణ కూడా ఇవ్వని వైనం
- చర్యలకు అధికారుల మీనమేషాలు



గుర్రంపాలెంలో గ్రావెల్ కోసం అక్రమంగా తవ్వేసిన కొండ

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తి మండలం గుర్రంపాలెం ఏపీఐఐసీ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన పలు కంపెనీలు గ్రావెల్ కోసం పక్కనున్న కొండలను తవ్వేశాయి. ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టడంపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించడంతో ఏపీఐఐసీ సహా తొమ్మిది సంస్థలకు గనుల శాఖ ఈ ఏడాది మార్చిలో షోకాజ్ నోటీసులు ఇచ్చింది. నిబంధనల ప్రకారం నోటీసులు తీసుకున్న పక్షం రోజుల్లో వివరణ ఇవ్వాలి. అయితే ఏపీఐఐసీతో పాటు రెండు కంపెనీలు మాత్రమే వివరణ ఇచ్చాయి. మిగిలిన కంపెనీల నుంచి స్పందన శూన్యం.

పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం పలు సంస్థలకు ఏపీఐఐసీ భూములు కేటాయించింది. అందువల్ల ఆయా కంపెనీలకు కేటాయించిన భూముల స్థితిగతులు ఏపీఐఐసీకి తెలుసు. భూములు చదును చేయడానికి గ్రావెల్ ఎక్కడ నుంచి తీసుకువచ్చారు?, సమీపంలోని కొండల నుంచి తెచ్చారా?, అందుకు అనుమతి ఉందా?...అనేది ఆయా కంపెనీలు ... మిగతా 8వ పేజీలో

ఎంవీవీ-ఎంకే పార్క్ స్థలంపై జాయింట్ సర్వే

జీవీఎంసీ నిర్ణయం

- రెవెన్యూ, జిల్లా సర్వే శాఖలకు అధికారుల లేఖ

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జోన్-6లోని కూర్మన్నపాలెంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ బహుళ అంతస్థుల సముదాయాలు (ఎంవీవీ-ఎంకే పార్క్) నిర్మించిన స్థలాన్ని రెవెన్యూ, జిల్లా సర్వే శాఖ ఏడీతో కలిసి సంయుక్తంగా సర్వే చేయాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. అపార్టుమెంటు నిర్మాణం కోసం 26.5 సెంట్లు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్... జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌తోపాటు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేష్, సీఎం చంద్రబాబు నాయుడుకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే చేయించగా 26.5 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్టు తేలింది. అయితే మరోసారి సర్వే జరపాలని జీవీఎంసీ అధికారులు భావిస్తున్నారు. కేవలం జీవీఎంసీ సర్వేయర్‌తో కాకుండా ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్టు ఆరోపణలు ఉన్నందున రెవెన్యూశాఖ, జిల్లా సర్వే శాఖ ఏడీతో కలిసి సంయుక్తంగా సర్వే చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆ రెండు శాఖలకు ఇప్పటికే జీవీఎంసీ అధికారులు లేఖ రాసినట్టు సమాచారం. జాయింట్ సర్వే నివేదికను బట్టి అపార్టుమెంట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

జిల్లా అభివృద్ధికి నూతన ప్రణాళికలు

అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశాలు

- సూపర్ సిక్స్ పథకాల అమలులో సమస్యలు గుర్తించి పరిష్కరించాలి
- జిల్లాలో 1,05,000 బంగారు కుటుంబాల గుర్తింపు
- ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల కోసం స్థల సేకరణ
- రోడ్లపై గుంతలు లేకుండా చూడండి



మాట్లాడుతున్న కలెక్టర్

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని రంగాల్లో ఉత్తమంగా నిలపడానికి అధికారులు నూతన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రైతుసేవా కేంద్రాల స్థాయి నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, డీఆర్‌డీఏ సహకారంతో కొత్త పాడి యూనిట్లు స్థాపన, ఉద్యానవన పంటల విస్తీర్ణం పెంపు, మత్స్యకారులకు శిక్షణ చేపట్టాలన్నారు. విశాఖ పర్యాటక డెస్టినేషన్‌గా ఉండాలని, పర్యాటకులు ... మిగతా 8వ పేజీలో

'కార్మిక పింఛన్ సొమ్ము పెంపునకు ప్రతిపాదనలు?'

తగరపువలస, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కార్మిక పింఛనుదారులకు కనీస పింఛను రూ.రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేలకు పెరిగే అవకాశం ఉందని జూట్ మిల్లు కార్మిక సంఘం అధ్యక్షుడు కె.రాంబాబు తెలిపారు. బుధవారం చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో జూట్ మిల్లులో పనిచేసిన కార్మిక పింఛనుదారుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ అపరాధిత పింఛనుదారుల సంఘ నాయకులు జనార్ధనరెడ్డి తదితరులకు ఈ పెంపుదల గురించి ప్రభుత్వం ఆలోచనచేస్తున్నదని ఒకటి, రెండు నెలలో ప్రభుత్వం ప్రకటన వెలువరిస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి డి.బాబాజీ మాట్లాడుతూ పింఛనుదారుల పోరాటాల వల్ల ఈ ఫలితాలు వస్తున్నాయని, అయినప్పటికీ తాము చేస్తున్న పోరాటాలను నిలిపివేయకూడదన్నారు. ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర నాయకులు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని, పెంపు ప్రకటన వచ్చే వరకు ఈ ప్రాంతంలో కూడా నిరసన కార్యక్రమాలను చేపడతామని అన్నారు. సమావేశంలో ఈ సంఘానికి చెందిన మోర అప్పలరాజు, చిల్ల అప్పారావు, పంపాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు స్వాతినక్షత్ర హవనం

సింహాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నారసింహస్వామి ఆవిర్భావమైన స్వాతినక్షత్రం పురస్కరించుకుని గురువారం వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సంప్రదాయ రీతిలో స్వాతి నక్షత్ర హవనాన్ని నిర్వహించేందుకు వైదిక కమిటీ సకల సన్నాహాలు పూర్తిచేసింది. నెలకు ఒక్కసారి మాత్రమే జరుగు ఈ ఆర్జిత సేవలో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానం నిర్ణయించిన రూ.2500 చెల్లించాలి. ఆ టికెట్టుపై ఇద్దరిని మాత్రమే అనుమతిస్తారు. సేవలో పాల్గొనే భక్తులు సంప్రదాయదుస్తులు ధరించాలి.

వైభవంగా అప్పన్న ఆర్జిత నిత్యకల్యాణం

సింహాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. దానిలో భాగంగా బుధవారం వేకువ జామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించికల్యాణవేదికపై ఉంచారు. ప్రత్యక్షంగా పాల్గొన్నభక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్రవిధానంలో స్వామి,అమ్మవార్లకు, కల్యాణకర్తలకు కంకణధారణలు కా వించారు. నూతన యజ్ఞోపవీతధారణ చేసి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడు మ జీలకర్రా బెల్లం,మాంగల్యధారణ, అక్షితారోపణలుచేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



బాండ్‌ను అందజేస్తున్న పర్యవేక్షణాధికారి

సింహాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన మండవ మహేష్ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116 నగదు రూపంలో ప్రజాసంబంధాల విభాగ పర్యవేక్షణాధికారి సునీల్‌కు బుధవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతకుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం చేయించి, శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

గుర్రంపాలెంలో అక్రమ క్వారీయింగ్

... 7వ పేజీ తరువాయి

వివరణ ఇవ్వాలి. ఇందుకు ఏపీఐఐసీ కూడా ప్రత్యేకించి చొరవ తీసుకుని కంపెనీల నుంచి నివేదిక తెప్పించి గనుల శాఖకు పంపాలి. ఈ విషయమై ఏపీఐఐసీకి గనుల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు లేఖలు రాయడంతో పాటు కలెక్టరేట్‌లో కలిసినప్పుడు నోటీసులకు వివరణ గురించి అడుగుతున్నారు. ఇదిలావుండగా గడువులోగా వివరణ రానందున గనుల శాఖ సుమోటోగా ఆయా కంపెనీలకు డిమాండ్ నోటీసులు ఇవ్వవచ్చు. కానీ ఆ శాఖ కూడా నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుర్రంపాలెం లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన కంపెనీలు సమీపంలో కొండల నుంచి సుమారు లక్షన్నర క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినట్టు గనుల శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. అందుకు రూ.కోట్లలో జరిమానా చెల్లించాల్సి ఉంది. ఒకవేళ సకాలంలో జరిమానా చెల్లించకపోతే ఆర్ఆర్ చట్టం కింద ఆస్తుల జప్తునకు నోటీసులు ఇచ్చే అధికారం కూడా గనుల శాఖకు ఉంది. దీనిపై గనుల శాఖ చొరవ తీసుకోవాలి.

బీచ్‌రోడ్డులో దుకాణాల తరలింపు అలజడి

- కంటతడి పెట్టిన పలువురు చిరు వ్యాపారులు
- వెనక్కుతగ్గని అధికారులు



తొలగింపు చేపడుతున్న దృశ్యం



పర్యవేక్షిస్తున్న ఏసీపీ రామకృష్ణ

భీమునిపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్‌రోడ్డులో చిరు వ్యాపారుల దుకాణాలను తొలగిస్తామంటూ జీవీఎంసీ అధికారుల హెచ్చరికతో వ్యాపారుల్లో ఆందోళన బయలుదేరింది. క్షణాల్లో బీచ్‌రోడ్డులో జీవీఎంసీ అధికారులు ఎక్స్‌కవేటర్, ఒక లారీతో ప్రత్యక్ష మవడంతో చిరు వ్యాపారుల్లో అలజడి ప్రారంభమైంది. భీమిలి జోనల్ కార్యాలయం ఏసీపీ రామకృష్ణ, పలు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు దుకాణాలు తొలగించేస్తామని బడ్డీల వద్దకు ఎక్స్‌కవేటర్ తీసుకురావడంతో వ్యాపారులు కంటతడిపెట్టారు. బడ్డీలను ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకుంటామని కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగా బడ్డీలను వెనక్కి జరుపుకున్నారు. బీచ్‌రోడ్డులో సముద్రం వైపు, ఫుత్‌పాత్‌లపై దుకాణాలు ఉండడానికి అవకాశం లేదని తక్షణం అన్ని బడ్డీలను తీసివేయాలని అధికారులు ఆదేశించడంతో ఐస్‌క్రీమ్ బండ్లతో సహా సముద్రం గెస్ట్‌హౌస్ నుంచి లైట్‌హౌస్ వరకూ వ్యాపారులు క్లియర్ చేశారు. డచ్ సిమెట్రీలు, జీసస్ పార్క్ వైపు దుకాణాలను మార్పు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీసీ రామకృష్ణ మాట్లాడగా జాతీయ రహదారులు, వుడా జోనల్ ప్లాన్‌లో ఉన్న రహదారుల్లో రోడ్లకు ఇరువైపులా ఆక్రమిత దుకాణాలు తొలగించామన్నారు. కాగా, బీచ్‌రోడ్డు ప్రస్తుతం ఒక చోట 30 అడుగులు, మరో చోట 25 అడుగులు ఉందని, ఈ రహదారిని 60 అడుగులకు విస్తరించాలనే ప్రతిపాదన ఉందన్నారు. రహదారి అభివృద్ధికి ఆమోదం రాగానే విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. దీంతో వ్యాపారులు ఊపిరిపీల్చుకున్నారు.



విజినిగిరిపాలెంలో శాకంబరిగా ఉమాదేవికి అలంకరణ



మానంఆంజనేయనగర్‌లో అన్నపూర్ణాదేవి అలంకరణలో త్రిపురసుందరీదేవి



ఎండాడలో శాకంబరి అలంకరణలో దుర్గాదేవి..



గీతంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో రాజరాజేశ్వరి

బహురూపాల్లో అమ్మవార్లకు అలంకరణ



.గుడ్లవానిపాలెం బీచ్‌రోడ్డులో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న కాళికామాత



స్వర్ణభారతినగర్‌లో అన్నపూర్ణాదేవికి పూజలు చేస్తున్న మహిళలు

సింహాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం మహావిశాఖ 98వ వార్డు పరిధి విజినిగిరిపాలెంలోని చంద్రమౌళేశ్వరస్వామి దేవేరి ఉమాదేవి భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. సూర్యోదయవేళ చంద్రమౌళేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉమాదేవి అమ్మవారిని పలురకాల కూరగాయలతో శాకంబరీమాతగా అర్చకస్వామి అలంకరించిన తీరు భక్తులను కట్టిపడేసింది. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎండాడ: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో బుధవారం అమ్మవారు అన్నపూర్ణగానూ, శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల్లో భాగంగా సంపెంగ, చామంతి పూలతో అర్చన నిర్వహించారు. కాయగూరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రాంగణంలో ఉన్న రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మధురవాడ : మానం ఆంజనేయనగర్‌లోని లలిత త్రిపురసుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి వారి ఆలయంలో లలిత త్రిపుర సుందరీదేవిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. మహిళలు కుంకుమపూజలు చేశారు. బింద్రానగర్‌లోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వతంత్రనగర్ కాలనీ, వాంబేకాలనీ, నగరంపాలెం తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు కుంకుమపూజలు చేశారు.

సాగర్‌నగర్: రుషికొండ స్వర్ణభారతినగర్‌లో శక్తిదుర్గ నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నప్రసాదాలు స్వీకరించారు. భవానీ మాలలు ధరించిన వారు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గుడ్లవానిపాలెం ముత్యాలమ్మ, భూలోకమ్మ, పోలమాంబ అమ్మవార్ల ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన దసరాపందిరిలో కాళికామాత విగ్రహం భక్తుల పూజలు అందుకుంటోంది. అన్నపూర్ణదేవిగా కాళికామాత దర్శనమిచ్చారు.

అప్పన్న సన్నిధిలో వైభవంగా తిరువీధి



తిరువీధిలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

సింహాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో తిరువీధి ఉత్సవం వైభవంగా జరిపారు. దానిలో భాగంగా సింహవల్లీతాయార్ ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచి ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితులు వేదపఠనాల నడుమ బేడామండపంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. మార్గంలో అమ్మవారికి నీరాజనాలు, నివేదనలు సమర్పించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కొమ్మాది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పి.ఎం.పాలెం సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయసేవా పథకం(ఎన్ఎస్ఎస్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్, సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైవ్‌సెంటర్ యూనిట్ ఆఫ్ వీకేఆర్ ట్రస్ట్ డాక్టర్ సుమన మాట్లాడుతూ రక్తదానం చేయటం వలన ఒకరికి ప్రాణదానం చేసినట్లన్నారు. రక్తం ఇవ్వండి.. ప్రాణాలు కాపాడండని కోరారు. విద్యార్థినీ, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, హెచ్.ఆర్. అక్షత, ఈఓ మధుబట్, డైరెక్టర్ వి.శివరాంప్రసాద్, ఏవో నాగేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ సీట్లు... విద్యార్థుల పాట్లు

... 7వ పేజీ తరువాయి

యాజమాన్యాలపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. కన్వీనర్ కోటాలో సీట్లు దక్కించుకున్నా వేలాది రూపా యలు చెల్లించాల్సి రావడంతో ఇటు విద్యార్థులు, మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చి వెళ్లిపోయే పరిస్థితి రావడంతో అటు యాజమాన్యాలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, సర్టిఫికెట్లు ఇవ్వ కుండా ఇబ్బంది పెట్టకూడదని, ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

ఎన్ఎస్ఆర్ఐటీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానంలో పాల్గొన్న విద్యార్థులు

ఆనందపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం మరొకరి ప్రాణదానమని ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంభుప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శొంఠ్యాం సమీపంలో ఉన్న ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ - 2025 కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి ఇచ్చిన రక్తంతో ముగ్గురు వ్యక్తులకు ప్రాణ దానం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సేవా కార్యక్రమాల్లో విదార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 90 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కళాశాల సీఎంవో డాక్టర్ సుబ్బరాజు, ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్, ఢిల్లీశ్వరరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

- యువతకు తహసీల్దారు ఆనందరావు సూచన



యువకులతో మాట్లాడుతున్న తహసీల్దారు ఆనందరావు

పద్మనాభం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కె.ఆనందరావు పేర్కొన్నారు. పద్మనాభంలోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం పరిశీలించిన ఆయన గ్రంథాలయంలోని వసతులు, అక్కడకు వచ్చే వార్తాపత్రికలు, అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాల గురించి గ్రంథాలయాధికారి అప్పారావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పత్రికలు చదువుతున్న యువకులతో మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన సమగ్ర సమాచారం ఇక్కడ అందుబాటులో ఉంటుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి దగ్గర, వీధులలోను సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాల్లో గడపడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకొని అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలన్నారు.

చేజారిన టీచర్ ఉద్యోగం.. అభ్యర్థిని కన్నీరుమున్నీరు



రేణుక

భీమునిపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చిందనుకున్న ఉపాధ్యాయ ఉద్యోగం చేజారడంతో ఓ అభ్యర్థిని కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. మండలంలోని చేపలుప్పాడ పంచాయతీచేపలదిబ్బడిపాలేనికి చెందిన కురందాసు రేణుక ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో పీఈటీ (ఎస్ఏ) పరీక్షకు హాజరై 64.5 శాతం మార్కులతో జిల్లాలో 280 ర్యాంకు సాధించింది. బీసీ -ఏ కేటగిరీకి చెందిన ఆమె గత నెల 27న కాల్ లెటర్ రావడంతో 28న గాజువాక స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు కూడా హాజరైంది. సర్టిఫికెట్లు అన్నీ సరిపోయాయని, సెలక్షన్ లిస్టు వస్తుందని వెబ్‌సైట్‌లో చూసుకోవాలని అధికారులు చెప్పారు. ఈనెల 15న ఫైనల్ లిస్టు వచ్చింది. బీసీ-ఏ కేటగిరీ ముగ్గురు మహిళలకు కేటాయించగా, ఇద్దరికి మాత్రమే అవకాశం ఇచ్చారు. మూడో వరుసలో ఆమె పేరుకు బదులు లావణ్య ప్రగడను స్పోర్ట్సు కోటాలో ఎంపిక చేశారు. స్పోర్ట్సు కోటా వేరేగా ఉందని, బీసీ-ఏ కేటగిరీ కింద తనకే పోస్టు రావాల్సి ఉందని రేణుక చెబుతున్నారు. ఈ విషయమై తాను న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఆమె తెలిపారు.

జిల్లా అభివృద్ధికి నూతన ప్రణాళికలు

... 7వ పేజీ తరువాయి

రెండు, మూడు రోజులు ఇక్కడ ఉండేలా అడ్వంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుచేయాలని, మూడు నెలల్లో రెండు క్యారవాన్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టూరిజం కోసం భూములు తీసుకున్నవారు కార్యకలాపాలు ప్రారంభించాలని, లేకపోతే కేటాయింపులు రద్దు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్య రంగాలతోపాటు సూపర్ సిక్స్ పథకాల అమలులో సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోసం శిక్షణ ఇవ్వడానికి విశాఖ ఐఏఎం ముందుకు వచ్చిందని, స్థానికంగా ఔత్సాహికులను గుర్తించి శిక్షణ ఇప్పించాలన్నారు. జిల్లాలో 1,05,000 మంది బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఆయా కుటుంబాలను మార్గదర్శకులు ఆదుకునేవిధంగా సచివాలయ స్థాయిలో సమావేశాలు ఏర్పాటుచేసి వారికి ఏమి కావాలో గుర్తించి అవసరాలు తీర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కేవలం డబ్బే కాకుండా వారికి అవసరమైన ఏ సహకారాన్ని అయినా అందించవచ్చన్నారు. ఫిషింగ్ హార్బర్ ఆధునీకీకరణ పనులు వేగవంతం చేయాలని, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల కోసం స్థల సేకరణ చర్యలు చేపట్టాలన్నారు. విమానాశ్రయం చుట్టుపక్కల ప్రాంతంలో పక్షులు ఎగురకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

జీవీఎంసీ, ఎయిర్‌పోర్టు, ఇరిగేషన్ అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. వీధి లైట్లు వెలగకపోయినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలన్నారు. 28.5 శాతం ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ఫలితాలు ప్రజలకు తెలిసే విధంగా నెలరోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని,

గురువారం ఉదయం ప్రభుత్వ కార్యాలయాల్లో ఎనిమిది గంటలు నుంచి తొమ్మిది గంటల వరకు ఏక్ దిన్ ఏక్ ఘంటా ఏక్ సాత్ పేరుతో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో భవానీ శంకర్, జిల్లా ఫారెస్ట్ అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

10 జీవీఎంసీలో జోన్‌లు

... 7వ పేజీ తరువాయి

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్‌గార్గ్ వద్ద అధికారులు జోన్‌ల పునర్వ్యవస్థీకరణ అంశాన్ని ప్రస్తావించగా, ఆయన జీవీఎంసీ పరిధిలోని ప్రజాప్రతినిధులతో చర్చించారు. వారంతా సరేనని చెప్పడంతో నియోజకవర్గాల వారీగా జోన్‌లను పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదన తయారుచేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులు, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్లు పలుమార్లు సమావేశమై వార్డులు, జోన్‌ల మ్యాప్‌లను పరిశీలించారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత ఒక నియోజకవర్గం పరిధిలో ఉన్నవార్డులను ఒకే జోన్ పరిధిలోకి మార్చుతూ డ్రాఫ్టను తయారుచేశారు.

భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో సరిహద్దు వార్డుల్లో ఉండేవారు తమ జోనల్ కార్యాలయాలకు వచ్చిపోవడానికి ఇబ్బందిగా ఉంటుంది కాబట్టి ఆయా నియోజకవర్గాల్లో రెండేసి జోన్‌లు ఉండేలా విభజించారు. తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కో జోనల్ కార్యాలయం ఉండేలా తయారుచేసిన ప్రతిపాదనను గత నెల 22న జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదానికి పెట్టారు. కౌన్సిల్ ఆమో దించి ప్రభుత్వ అనుమతికి పంపించింది. దీనికి రాష్ట్రప్రభుత్వం కూడా దాదాపు అంగీకరించడంతో త్వరలో అధికారిక ఉత్తర్వులు వెల్లడికానున్నాయి. వచ్చేనెల ఏడో తేదీ నాటికి కొత్తజోన్‌లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని, అందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేసుకోవాలని అన్నివిభాగాల అధిపతులకు జీవీఎంసీ కమిషనర్ బుధవారం ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు. కొత్త జోనల్ కార్యాలయాలు ఏర్పాటుకు అవసరమైన భవనాలను గుర్తించడంతోపాటు సిబ్బందిని, ఫర్నీచర్‌ను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించినట్టు సమాచారం.

మాస్టర్ ప్లాన్‌లో మార్పులు

... 7వ పేజీ తరువాయి

విమర్శలు వచ్చాయి. కంటి తడుపుగా అభ్యంతరాలు స్వీకరించిన వైసీపీ ప్రభుత్వం వాటిని పరిశీలించకుండా పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై దృష్టిసారించింది. చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రణవ్ గోపాల్ నియోజకవర్గాల వారీగా అభ్యంతరాలు స్వీకరించారు. అందులో ఎమ్మెల్యేలను కూడా భాగస్వాములను చేశారు.

పరిశీలన, చర్యలకు శ్రీకారం

వేల సంఖ్యలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్న అధికారులు అన్నింటినీ క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేస్తున్నారు. నిజంగానే తప్పులు జరిగాయా?, ప్రతిపాదించిన రహదారులు అక్కడ అవసరమా?..అనే విషయాలు పరిశీలిస్తున్నారు. వీలైనంత వరకు ప్రభుత్వ భూముల మీదుగానే రహదారులు వెళ్లేలా చూస్తున్నారు. ఇప్పటికే లేఅవుట్లుగా మారిన భూముల మధ్య నుంచే ఏమైనా రహదారులు ఉంటే వాటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో అడ్డగోలు నిర్ణయాలంటూ కొన్ని రహదారులపై తీవ్రమైన చర్చ జరిగింది. వాటిని ఇప్పుడు మార్చేందుకు అధికారులు నిర్ణయించారు.

రుషికొండలో ఏ-1 కన్వెన్షన్ సెంటర్ వైపు...

రుషికొండలో ఏ-1 కన్వెన్షన్ సెంటర్ వద్ద 200 అడుగుల మేర రహదారి విస్తరణకు ప్రతిపాదించారు. అయితే కన్వెన్షన్ సెంటర్‌కు నష్టం రాకుండా రెండో వైపు రహదారి విస్తరణకు అప్పట్లో ప్రతిపాదించారు. దీనిని కూడా ఇప్పుడు అధికారులు సరిచేస్తున్నారు. అటు..ఇటు సమానంగా విస్తరణ చేయడానికి ప్లాన్ సరి చేస్తున్నారు.

దసపల్లా హిల్స్‌లో నేవీ హౌస్‌కు నష్టం లేకుండా

నగరంలో దసపల్లా భూములను వైసీపీ నాయకులు హస్తగతం చేసుకున్న సంగతి తెలిసిందే. అక్కడ అతి పెద్ద అపార్టుమెంట్ల నిర్మాణానికి ప్లాన్ చేసుకున్నారు. అందుకోసం మాస్టర్‌ప్లాన్‌లో 100 అడుగుల రహదారిని ప్రతిపాదించారు. వాస్తవానికి అటు వైపు అంత ట్రాఫిక్ ఉండదు. పైగా విస్తరణ సర్క్యూట్ హౌస్ వైపు లేకుండా, ఎదురుగా ఉన్న నేవీ హౌస్ వైపు ప్రతిపాదించారు. అసలు అక్కడ 100 అడుగుల రహదారి అవసరమే లేదంటూ అక్కడి నివాసితులు కొందరు హైకోర్టుకు వెళ్లారు. దాంతో అక్కడ కూడా సవరణ చేస్తున్నారు. స్థానికులు 60 అడుగులు సరిపోతుందని చెబుతుండగా, అధికారులు 80 అడుగులు ఉంచాలని భావిస్తున్నారు. రెండు వైపుల సమానంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

- పార్క్ హోటల్ జంక్షన్ నుంచి దత్ ఐల్యాండ్ వరకు రహదారి విస్తరణకు రైల్వే గెస్ట్ హౌస్, క్రిస్టియన్ స్కూల్ మాత్రమే అడ్డంకిగా ఉన్నట్టు, మిగిలినవన్నీ ప్రభుత్వ భూముల్లోనే ఉన్నట్టు గుర్తించారు. దాంతో ఆ మార్గం విస్తరణకు లైన్ క్లియర్ అయినట్టుగా చెబుతున్నారు.
- దత్ ఐల్యాండ్ నుంచి జీవీఎంసీ కమిషనర్ బంగ్లా మీదుగా తెలుగుతల్లి ఫ్లైఓవర్ వరకు రహదారిని విస్తరణ చేస్తే సంపత్ వినాయకుడి ఆలయం అడ్డంకిగా ఉంది. ఆ మార్గంలో ఎంవీపీ పీక్ కొత్త రహదారి కోసం భూమిని జీవీఎంసీకి అప్పగించింది. మధ్యలో మరో సంస్థ కూడా అలాగే భూమి విడిచి పెట్టింది. వాటి అలైన్‌మెంట్‌లో ఆ మార్గాన్ని విస్తరించాలని అనుకుంటున్నారు. ఈ మార్గంలో మెట్రో రైలు ప్రాజెక్టు ఉంది. వారు ఎక్కడ మెట్రో స్టేషన్ పెడతారో చూసుకొని దాని ప్రకారం ఈ మార్గం విస్తరించాలని భావిస్తున్నారు.

బిల్డర్‌కు అనుకూలంగా అలైన్‌మెంట్

వేపగుంటలో ఓ బిల్డర్‌కు లబ్ధి చేకూర్చడానికి రహదారి అలైన్‌మెంట్‌ను గతంలో మార్చేశారు. సింహాచలం గోశాల నుంచి వేపగుంట వెళ్లే మార్గం విస్తరణలో ఆ బిల్డర్‌కు నష్టం లేకుండా రెండో వైపు పనులకు ప్రతిపాదించారు. దానినిఇప్పుడుసరిచేసి, ఇరువైపులా సమానంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

- రైల్వే ఆస్పత్రి నుంచి రైల్వే స్టేషన్ వరకు భూములు రైల్వేకి సంబంధించినవి కావడం, అభ్యంతరాలు లేకపోవడంతో దానిని పూర్వం అనుకున్నట్టుగానే విస్తరిస్తారు.
- పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి, ఎలమంచిలి ప్రాంతాలకు మాస్టర్ ప్లాన్‌లో రహదారులు ప్రతిపాదించలేదు. ఆయా ప్రాంతాల నుంచి అభ్యర్థనలు రావడంతో ప్రధాన రహదారులతో అనుసుంధాన మార్గాలను కొత్తగా ప్రతిపాదిస్తున్నారు.
- విజయనగరం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో నీటి వనరులు గుర్తించారు. అయితే అవన్నీ జిరాయితీ భూములుగా తేలడంతో వాటిని మార్చాలని నిర్ణయించారు.

బురద రోడ్లతో వాహనదారుల బేజారు



అడుగు వేయడానికి కూడా వీలు లేని స్థితిలో ఉన్న రోడ్డు

- రామ్‌నగర్‌లో అధ్వానంగా రోడ్లు
- యూజీడీ పనుల అనంతరం మరమ్మతులు చేపట్టకపోవడంతో మట్టితో నిండిన రహదారులు
- చినుకు పడితే బురదమయం
- దిగబడుతున్న వాహనాలు
- రాకపోకలకు సైతం వీలు లేని పరిస్థితి

రామ్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో రహదారులు మరీ దారుణంగా తయారయ్యాయి. రోడ్ల నిండా మట్టి నిండిపోవడంతో చినుకులు పడితే చాలు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోతోంది. వాహనాల చక్రాలు దిగబడిపోతున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు రెండు నెలల క్రితం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు, ఈ పనుల్లో భాగంగా అండర్ గ్రౌండ్‌లో పనులు చేసేందుకు రామ్‌నగర్‌లో ఉన్న పలు సందులతో పాటు ప్రధాన రోడ్లలో తవ్వకాలు చేపట్టి, నెల రోజుల పాటు నింపాదిగా పనులు నిర్వహించారు. ఈ క్రమంలో రోడ్లన్నీ మట్టి మయం అయ్యాయి. యూజీడీ పనుల చేపట్టిన సిబ్బంది ఆ తర్వాత రోడ్ల గురించి పట్టించుకోలేదు. ఎలా ఉన్నది అలాగే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో తవ్వకాలు చేసిన రహదారులు మట్టిమయంగా మారిపోయాయి. చిన్న వర్షం పడినా ఈ ప్రాంతం బురదమయంగా తయారవుతున్నదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. రాకపోకలు సాగించేందుకు వీలు లేని విధంగా రహదారులను మార్చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ రహదారి పరిస్థితే ఇంత దారుణంగా ఉన్నా ఏ అధికారి, ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బురద రోడ్డుపై దిగబడిన వాహనం



రహదారిపై పేరుకుపోయిన బురద

రహదారులను తవ్వి పనులు చేపట్టిన అధికారులు కాంట్రాక్టరులు పనులు పూర్తయిన తర్వాత రహదారులను మరమ్మతులు చేపట్టకుండా చల్లగా జారుకున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రామ్‌నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

జైలు ఆవరణలో ఖైదీలు పండించిన ఆనపకాయల అమ్మకం



అమ్మకానికి తరలిస్తున్న ఆనపకాయలు

ఆరిలోవ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో జైలు బయట గల వ్యవసాయ క్షేత్రాల్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. వాటిలో ఆనప కాయలు సుమారు ఎకరా స్థలంలో సాగు చేశారు. ఈ పాదుల నుంచి వచ్చిన ఆనప కాయలను కోసి జైలులో ఖైదీలకు కూరలుగా వాడుతారు. బుధవారం సుమారు 400 కిలోల ఆనప కాయలను తూకం వేసి వాటిని జైలు లోకి రిక్షాలో తరలించేందకు సిద్ధం చేశారు. ఎలాంటి రసాయన ఎరువులు లేకుండా కేవల ఆవు పేడ ఎరువుగా వేసి వీటిని పండించారు. ఇవి తినడానికి రుచికరంగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదు. జైలులో అవసరాలు పోను మిగిలిన ఆనప కాయలను కారాగారం బయట గల సుధార్ క్యాంటిన్‌లో విక్రయించారు. ఒక్కో ఆనపకాయ రూ.20 చొప్పున విక్రయించారు. రైతు బజార్‌లో కంటే తక్కువ ధర కావడంతో వీటిని కొనేందుకు అటుగా వెళుతున్న వారు ఎగబడ్డారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు విక్రయాలు చేపట్టనున్నట్టు జైలు అధికారులు తెలిపారు.

కనకమహాలక్ష్మికి లక్ష చామంతులతో పూజ



అమ్మవారికి పూజ చేస్తున్న మద్దినేని సురేష్‌భాను, మాధవి దంపతులు

మహారాణిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి బుధవారం లక్ష చామంతులతో పూజ చేశారు. ఈ పూలను విజన్ డెవలపర్స్ సంస్థ ఎండీ మద్దినేని సురేష్‌భాను, మాధవి దంపతులు సమకూర్చారు. ఆలయ అర్చకులు సురేష్‌భాను దంపతులతో ప్రత్యేక పూజ చేయించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు, వేదాశీర్వచనాలు అందజేశారు.

చిన్న రుషికొండలో బడ్డీల తొలగింపు



చిన్నరుషికొండలో తొలగిస్తున్న బడ్డీలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ చేపట్టిన ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా ఫుట్‌పాత్‌లపై బడ్డీల తొలగింపు కార్యక్రమం బుధవారం జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పర్యవేక్షణలో కొనసాగింది. బడ్డీలు తొలగిస్తుండగా దుకాణదార్లు ప్రాధేయపడ్డారు. స్వచ్ఛందంగా తొలగించుకోవడానికి కాస్త సమయమివ్వడంతో కొందరు తమ వస్తువులను తరలించారు. తొలగించని దుకాణదార్ల బడ్డీలనుటౌన్‌ప్లానింగ్ సిబ్బంది క్రేన్‌లతో లారీలపైకి ఎక్కించి దుకాణదార్లు కోరిన చోటకు తరలించారు. మరికొంతమంది బడ్డీలను వ్యాన్‌లలో ఇతర ప్రాంతాలకు తరలించారు. బడ్డీలను తొలగించిన చోట మళ్లీ పెట్టకుండా ఆ ప్రాంతాలను జేసీబీ సహాయంతో దున్నించారు. బడ్డీలను తొలగించడం వలన జీవనోపాధి కోల్పోయామని బడ్డీవ్యాపారులు లబోదిబోమన్నారు. మధురవాడ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రాజు, నాయుడు, సచివాలయ సెక్రటరీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ లంగ్స్' కొనసాగింపు



బడ్డీలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కొమ్మాది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో జీవీఎంసీ నిర్వహిస్తున్న బడ్డీల తొలగింపు కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఇప్పటికే మిథిలాపురి ఉడాకాలనీ, కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డులో దుకాణాలు తొలగించిన జీవీఎంసీ సిబ్బంది బుధవారం శివశక్తినగర్ రోడ్డులో జోన్-2 ఎ.సి.పి. శాస్త్రి ఆధ్వర్యంలో బడ్డీలు, తోపుడుబండ్లను తొలగించారు. బడ్డీలను, తోపుడుబండ్లు రోడ్డుపక్క ఉన్నా అనుమతించబోమని, మధురవాడలోని అన్ని రహదారులలో ఈ ఆపరేషన్ లంగ్స్ కొనసాగుతుందని ఎ.సి.పి. స్పష్టం చేశారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు

ఆరిలోవ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల దీన దయాళపురంలో వెలసిన విజయ దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి మూడో రోజైన బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంగా ఆలయం అర్చకులు తీర్చి దిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు

ఈ సందర్భంగా అమ్మవారికి గులాబీలతో అలంకరించారు. కార్యక్రమం అలయం అధ్యక్షుడు యల్లమల్లి సురేష్. ఖాదర్ బాషా, గౌతమీ సేవాసంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓజి** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

16వ వార్డులో ఆపరేషన్ లంగ్స్

- భారీ సంఖ్యలో దుకాణాల తొలగింపు
- చిరు వర్తకుల వాగ్వాదం
- వెనక్కు తగ్గని అధికారులు



ఉద్రిక్త వాతావరణంలో బడ్డీలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

వెంకోజీపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ లంగ్స్ (లైఫ్ టు సేవ్ అర్బన్ గ్రీన్ స్పేసెస్)లో భాగంగా బుధవారం జోన్-3లోని 16వ వార్డులో ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ వరకు రోడ్డుపై ఆక్రమించి ఉన్న బడ్డీలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఉదయం 7 గంటలకే టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బందితో పాటు క్రేన్‌లు, టిప్పర్లు, లారీలు, పోలీసులు కూడా బడ్డీల వద్ద మోహరించారు. కొంతమంది ముందే తేరుకుని గత రెండు మూడు రోజులుగా బడ్డీలు, సామానులను ఖాళీ చేయడం, వీలైనంత వరకు బడ్డీలను తొలగించడం చేశారు. కానీ మరికొంత మంది మార్జిన్ లోపల దుకాణాలు ఉంటే ఏమీ అనరనే ఉద్దేశంలో ఉన్నారు. అయితే అలాంటిదేమీ లేకపోవడంతో ఆయా దుకాణదారులు అయోమయానికి గురయ్యారు. అధికారులతో కొందరు వాదనలకు దిగి తొలగింపును నిలుపుదల చేసే యత్నం చేశారు. కానీ అధికారులు, సిబ్బంది వారి మాటల్ని ఖాతరు చేయకుండా బడ్డీలను తొలగించారు. కొన్ని చోట్ల అక్రమంగా ఇటుక, సిమెంటుతో నిర్మించిన వాటిని టిప్పర్ల సాయంతో నేలమట్టం చేశారు. చాలామంది అక్రమంగా బడ్డీలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చారని సిబ్బంది వెల్లడించారు. వీరివల్ల నిజంగా బడ్డీలపై ఆధారపడి బతికే వారికి అన్యాయం జరుగుతోందని, కానీ వీరికి అన్యాయం జరగకుండా జీవీఎంసీ సముచిత న్యాయం చేస్తోందని బాధితులకు చెప్పారు. రహదారిలో పాదచారుల వంతెనపై ఇటువంటి దుకాణాలతో పాటు, ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న బడ్డీలను తొలగించి లారీల్లో తరలించారు.

చిరువర్తకులను యాచకులుగా మార్చవద్దు

- జోన్-2 కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన



సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కొమ్మాది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిరువర్తకులను యాచకులుగా మార్చవద్దని, తమ కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని నినదిస్తూ చిల్లర వర్తకులు, తోపుడుబండ్ల కార్మికులు జీవీఎంసీ జోన్-2 కార్యాలయం వద్ద అభ్యర్థించారు. బుధవారం మధురవాడ పరిసర ప్రాంత చిల్లర వర్తకులు జోనల్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. జెడ్సీ ఇచ్చిన మాట ప్రకారం తాత్కాలికంగా వర్తకం చేసుకునేందుకు అనుమతించాలని నినదించారు. సర్వీస్ రహదారిపై బైఠాయించి 'బాబ్బాబు' అంటూ భిక్షాటన చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటంతో పి.ఎం.పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీఐటీయూ నాయకులు అప్పలరాజు, రాజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. బాధితులు పోలీస్ వాహనానికి అడ్డుగా కూర్చుని నినాదాలు చేయటంతో ఉద్రిక్తత ఏర్పడింది. జెడ్సీని పిలిపిస్తామని తెలపటంతో జెడ్సీ చాంబర్ వద్ద బైఠాయించారు. వారు మాట్లాడుతూ అప్పులు తెచ్చుకుని వర్తకం చేసుకుంటూ జీవించేవారిని తీవ్రంగా దెబ్బతీశారని అన్నారు. వెంటనే హాకర్ల జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమను వ్యాపారం చేసుకోనివ్వాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ చుట్టుపక్కల ప్రాంతాల చిరువర్తకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో కంబాలకొండలో రెండు అతిథి గృహాలు

- సందర్శకుల విడిది కోసం నిర్మాణం



నిర్మాణ దశలో ఉన్న గెస్ట్‌హౌస్‌లు

ఆరిలోవ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ పార్కులో సందర్శకులు విడిద చేసేందుకు రెండు గెస్ట్ హౌస్‌లు నిర్మిస్తున్నారు. ఈ రెండు గెస్ట్ హౌస్‌లకు రూ.18 లక్షల వన సంరక్షణ నిధుల నుంచి నిర్మాణం చేస్తున్నట్టు కంబాకొండ అటవీ శాఖాధికారులు తెలిపారు. గతంలో మూడు గెస్ట్ హౌసులు పూర్తి స్థాయిలో అన్ని సౌకర్యాలతో నిర్మించారు. అయితే అవి ఇంతవరకూ సందర్శకులకు అందుబాటులోకి తీసుకు రాలేదు.

రోడ్లపై యథేచ్ఛగా పశువుల సంచారం

- నియంత్రణపై దృష్టి సారించని అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు



రాత్రి వేళ హెచ్‌బీ కాలనీ రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వాహనచోదకులకు వేగాన్ని నిరోదించేందుకుజీవీఎంసీ, పోలీసు శాఖ వారు స్పీడ్ బ్రేకర్‌లను రోడ్లపై ఏర్పాటు చేస్తారు. కానీ వాహనచోదకుల ప్రాణాలతో చెలగాటం ఆడేందుకు కదిలే వేగనిరోదకాలు అంటే రోడ్లపై పశువుల సంచారం ఎక్కువ అవుతోంది. జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ సులభ్ కాంప్లెక్సు ప్రాంతంలోని పశువుల సంచారం ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇది వరకే ఇక్కడ రోడ్లపై ఆవులు పడుకుని ఉండడంతో రాత్రి పూట రోడ్డు ఖాళీగా ఉండటం వల్ల వేగంగా వచ్చే వాహనచోదకులు ఈ రోడ్లపై నిద్రించే గోవులు కనిపించక ప్రమాదాలకు గురి కావడమే కాకుండా ఒకరిద్దరు ప్రాణాలను కూడా కోల్పోయారు. సరిగ్గా రెండేళ్ల క్రితం (సెప్టెంబరు 4, 2023) రాత్రి 12 గంటలకు స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలో పాల్గొని వస్తున్న యువకుడు వెంకటేష్ రోడ్డుపై నిద్రిస్తున్న గోవును ఢీకొని గాలిలో ఎగిరి నేలపై పడడంతో అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయాడు. ఈ ప్రమాదంలో ఆవు కూడా మరణించింది. ఆ తరువాత కొంతకాలం ఆవులను నిరోధించారు.

కానీ మళ్లీ మామూళ్లగానే ఆవులను రోడ్లపైకి వదిలేస్తున్నారు. వాటి వల్ల సంపాదన అర్జిస్తున్న గోవుల యజమానులు తమ అవసరం తీరాక ఇలా రోడ్లపైకి వదిలేయడంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వాహనచోదకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న గోవుల యజమానులపై కఠిన చర్యలు చేపట్టాలని అంటున్నారు.

ట్రంప్ ఒత్తిళ్లకు మోదీ తలొగ్గరు : బీజేపీ నేత వెంకటరావు

మురళీనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృత్తి నిపుణులను ఆహ్వానిస్తూ 35 సంవత్సరాల క్రితం తీసుకొచ్చిన హెచ్ 1 బి వీసా విధానం సరికొత్త ఆవిష్కరణలకు నెలవై, అమెరికా దేశపు పరపతిని పెంచిందని బీజేపీ నాయకుడు మూల.వెంకటరావు పేర్కొన్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అంటూ వలస వ్యతిరేక జాతీయ వాదంతో అమెరికా ఇపుడు హెచ్ 1 బి వీసాలకు సంబంధించి కఠినమైన నిబంధనల్ని విధించిందని, వీసా రుసుం పెంపు నిర్ణయం అమెరికాలో ఇప్పటికే స్థిరపడిన వారితో సైతం కొత్తగా అక్కడకు వెళ్లే వారికి నష్టదాయకంగా తయారైందని అన్నారు. హెచ్ 1బి వీసాదారుల్లో 71 శాతం ఇండియా వారేనని తెలిసే అమెరికా ఇలా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. పైకి మిత్రదేశం అంటూనే, భారత్‌పై పగబట్టారని అన్నారు. భారత్ విధానాలపై ట్రంప్ అసహనంతో ఇలాంటి చర్యలకు దిగినా దేశ ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోరని పేర్కొన్నారు. అమెరికాలో ఉన్న అత్యధిక శాతం విదేశీయులే నని పేర్కొన్న మూల వెంకటరావు భారత్‌లో వ్యతిరేకత పెంచాలన్న ప్రయత్నమే ఈ నిర్ణయమన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ

భీమునిపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వన్, టు, త్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ మాట్లాడుతూ జాతీయ సేవా సమితి యువతలో సామాజిన బాధ్యతను, దేశభక్తిని, సమాజ సేవా తత్పరతను పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రవీణ, అప్పలనాయుడు, శ్రీను, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


అన్నపూర్ణాదేవిగా అలంకరించిన వన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారు


సీతమ్మధారలో మీనాక్షి అమ్మవారి అలంకరణలో దుర్గాదేవి


వామనమూర్తిగా దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి


డాబాగార్డెన్స్‌లో అన్నపూర్ణాదేవి అవతారంలో ఉమాదేవి

కాశీ అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు

మహారాణిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడో రోజు బుధవారం కాశీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు పాలు, పెరుగు, గంధం, పసుపు కుంకుమలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో కలిపి 108 ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో అమ్మవారిని కాశీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఆలయంలో ప్రత్యేకంగా 150 బియ్యం బస్తాలతో గర్భాలయాన్ని సుందరంగా అలంకరించారు. సాయంత్రం దేవాలయంలో 250 మంది మహిళలతో వాసవి కనకదుర్గకు కోటి కుంకుమార్చన, హోమం జరిపించి, అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. గురువారం కన్యకాపరమేశ్వరీ అమ్మవారు ఉడుపి శ్రీకృష్ణుడిగా దర్శనమిస్తారు.

మీనాక్షి, వామనమూర్తి రూపాల్లో దర్శనం

సీతమ్మధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్ రోడ్డులో గల షిరిడి సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా అయ్యవారిని వామనమూర్తిగా, దుర్గాదేవిని మీనాక్షి దేవిగా అలంకరించారు. భక్తులు ఆలయానికి విచ్చేసి పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివరామకృష్ణ దేవాలయంలో వేంచేసిన ఉమాదేవి అమ్మవారు బుధవారం భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజ, సాయంత్రం హారతులు నిర్వహించారు. ఆలయ ఈవో రమాబాయి సారథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి జి.మన్మథరెడ్డి, అర్చకులు భార్గవశర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

మహాశివలింగానికి ఇత్తడి కవచం, తోరణం వితరణ

సీతమ్మధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):: నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహాశివలింగానికి ఆలయ ప్రధాన అర్చకులు రామారావు శర్మ, లక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు ఇత్తడితో కవచం, మకర తోరణం, త్రిశూలం, ఢమరుకాన్ని వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహకాధికారి బండారు ప్రసాద్‌కు ఆభరణాలను అందచేశారు. మహాశివలింగానికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామారావు శర్మ జన్మదినం నేపథ్యంలో దేవుని సన్నిధిలో సేవా నిమిత్తం ఆభరణాలను అందచేసినట్లు దాత కుటుంబ సభ్యులు తెలిపారు.


బహూకరించిన ఇత్తడి కవచం, తోరణంతో శివలింగానికి అలంకరణ

విద్యార్థినులు సేవాభావాన్ని అలవరుచుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. సేవా భావాన్ని అలవరుచుకోవాలని, సాటి మనుషులపట్ల సానుభూతి, సౌభ్రాతృత్వం కనబరిచి చిత్తశుద్ధితో జీవించాలని అన్నారు. అనంతరం 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా ,సెయింట్ జోసెఫ్ కళాశాల ఆధ్వర్యంలో అక్షయ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 250మంది స్థానికులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.మాణిక్య కుమారి, వలంటీర్లు, ఆసుపత్రి ప్రతినిధి హరి, వైద్యసిబ్బంది వెలంగణిరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటే ప్రోత్సాహకం అందిస్తాం: సేవా రజనీ


విద్యార్థినికి నోట్ పుస్తకాలు అందజేస్తున్న పైడి రజనీ తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న ప్రతీ ఒక్కరికీ ప్రోత్సాహం అవసరమని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవా) అధ్యక్షురాలు పైడి రజనీ అన్నారు. బుధవారం వన్‌టౌన్ పరిధిలోని ఏవీఎన్ కళాశాలలో 200 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులు పలువురికి శక్తి సంస్థ తరఫున ఫీజులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అధ్యాపకులు డాక్టర్ అర్చన, ఎస్.ఇందిర, అప్పారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న క్రైమ్ ఎస్ఐ రాజు

సీతంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ నాలుగో లైన్‌లో గల గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల్లో ద్వారకా క్రైమ్ పోలీసులు బుధవారం దొంగతనాలు, నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన క్రైమ్ ఎస్ఐ రాజు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, సెల్ ఫోనులో వచ్చే ఫ్రాడ్ లింక్స్‌ను క్లిక్ చేయకుండా ఉండాలని, అపరిచితులు తారస పడి బ్యాంక్, ఆధార్ తదితర అంశాల గురించి అడిగితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


లక్ష్మీనారాయణపురంలో ఆక్రమణలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

సీతమ్మధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ చేపట్టిన ఆపరేషన్ లంగ్స్ కార్యక్రమంలో భాగంగా సీతమ్మధార రైతుబజార్ సమీపంలో తోపుడు బండ్లు, చిరువ్యాపారుల బండ్లను బుధవారం తొలగించారు. సీతమ్మధార ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లపై గల, రోడ్డును అక్రమించి పెట్టిన బండ్లను, బడ్డీలను తొలగించారు. దీంతో రహదారి విశాలంగా కనిపించడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేశారు. చిరువ్యాపారులు మాత్రం 'ఇదేం అన్యాయం' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదనరావు పర్యవేక్షణలో సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

46వ వార్డులో బడ్డీలు తొలగింపు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీలో భాగంగా గ్రేటర్ 46వ వార్డులో రోడ్డుపై ఏర్పాటు చేసిన తోపుడు బళ్ళు, బడ్డీలను బుధవారం జీవీఎంసీ అధికారులు తొలగించారు. జీవీఎంసీ నిర్మించిన డ్రైనేజీలపై సిమెంట్ దిమ్మలు వేసి ఏర్పాటు చేసిన బడ్డీలను సైతం తొలగించారు. వార్డు పరిధిలోని లక్ష్మీనారాయణపురంలో బడ్డీలు, తోపుడు బళ్లను తొలగించేటప్పుడు ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలీసుల బందోబస్తు మధ్యలో వీటిని తొలగించారు.

మాధవధారలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు దీపికా శ్యామల, సునీల్, వైద్య సిబ్బంది తదితరులు

మాధవధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాధవధార అంబేడ్కర్ కాలనీ యూపీహెచ్‌సీలో బుధవారం ఆరోగ్యవంత మహిళ..శక్తివంతమైన కుటుంబం (స్వస్థ్ నారీ సశక్త్ పరివార్) కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహార పంపిణీ విధానంతో పాటు అంగన్వాడీ లబ్ధిదారుల వివరాల్ని బీజేపీ నాయకులు దీపికా శ్యామల, సునీల్ అగర్వాల్ అడిగి తెలుసుకున్నారు. 100 రోజుల పాటు మహిళల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ దిశగా ఈ కార్యక్రమం అమలవుతుందని అంబేడ్కర్ కాలనీ వైద్యుడు వెంకటేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా, అంగన్వాడీ, లాబ్ సిబ్బంది, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వాల్తేరు డివిజన్‌లో సీఆర్ఎస్ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్ మిశ్రా, డీఆర్ఎం బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని రాయగడ, విజయనగరం మూడో లైను ప్రాజెక్టుకు సంబంధించి డొంకినవలస-బొబ్బిలి మధ్య 12 కి.మీ నిడివిలో కొత్తగా విద్యుదీకరించిన లైనును సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ (సీఆర్ఎస్) బ్రిజేష్‌కుమార్ మిశ్రా తనిఖీ చేశారు. బుధవారం పర్యటించిన ఆయన 25 టీ యాక్సిల్ లోడ్‌కు అనుగుణంగా కొత్తగా నిర్మించిన పట్టాలు, వంతెనలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన స్పీడ్ ట్రయిల్ విజయవంతం కావడంతో రైళ్ల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేషన్ యార్డులు, హై లెవెల్ ప్లాట్‌ఫామ్‌లు, వంతెనల వద్ద వేసిన కొత్త క్రాస్ ఓవర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు అంకుష్ గుప్తా, అశోక్‌కుమార్, ఎస్.కె.పాత్రో తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కథా కచేరి



సమావేశంలో మాట్లాడుతున్న భాగవతుల సత్యనారాయణ మూర్తి

సీతంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ డిగ్రీ కళాశాల్లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రచయితల స్వీయ కథా పఠనం, కథా కచేరి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సభకు భాగవతుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహిస్తూ కథను నిర్వచించి మంచి కథా లక్షణాలను విశదీకరించారు. కథా కచేరిలో చల్లా రాంబాబు పందిరి మంచం, భాగవతుల సత్యనారాయణ మూర్తి పరంధామయ్య గారి బస్సు ప్రయాణం, చిన సూర్యనారాయణ పోయినోళ్లందరూ మంచోళ్ళు, రాంపిళ్ల శివాజీ అమ్మ, ఎం.పరమేశ్వరరావు నాయనోరు, గుంటూరు సత్యనారాయణమూర్తి భార్య సోమంచి, వినయ భూషణరావు స్వాతంత్ర్యం ఖరీదు, డాక్టర్ కేవీఎస్ చావుతప్పి లొట్ట, డీఎస్ కుమార్ మానవీయతపై కథలను వినిపించారు. చల్లా రాంబాబు సమీక్షించగా లలితా వాశిష్ట క్షమయా ధరిత్రి కథను విశ్లేషించారు.

టీడీపీ నూతన కమిటీకి ఎంపీ అభినందన


కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎంపీ భరత్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు టీడీపీ నూతన కమిటీ సభ్యులు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌ను బుధవారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎంపీ అభినందించారు. ఎంపీని కలిసిన వారిలో వార్డు అధ్యక్షుడు కన్నం వెంకటరమణారావు, కార్యదర్శి ముక్కి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు జనపల కృష్ణ, సీనియర్ నాయకుడు శ్రీకృష్ణ, వార్డు ఇన్‌చార్జ్, పార్లమెంటరీ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ తదితరులు ఉన్నారు.

'రాజ్యాధికారంతోనే అణగారిన వర్గాలకు విముక్తి'

సీతంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారం పొందితేనే అణగారిన వర్గాలకు విముక్తి అని అంబేడ్కర్ భావించారని ఆ దిశగానే ఆయన పోరాటం చేశారని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో ఏఎంసీ ఆధ్వర్యంలో 'పుణే ఒడంబడిక దళిత రాజకీయాలపై దాని ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దళితులు ఆర్థిక శక్తిగా ఎదగాలంటే ప్రత్యేక ఓటింగ్ పద్ధతి ద్వారా తమ అభ్యర్థులను తామే ఎన్నుకునే విధానం అమలు జరిగి ఉంటే నిజమైన దళిత ప్రతినిధులు ఎన్నికయ్యే వారని పేర్కొన్నారు. ఏఎంసీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఆచార్య అర్జున్, సత్యనారాయణ, ఎస్ సుధాకర్, మహేష్, వేమన తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి నూతన ప్రణాళికలు

... 7వ పేజీ తరువాయి

రెండు, మూడు రోజులు ఇక్కడ ఉండేలా అడ్వంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుచేయాలని, మూడు నెలల్లో రెండు క్యారవాన్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టూరిజం కోసం భూములు తీసుకున్నవారు కార్యకలాపాలు ప్రారంభించాలని, లేకపోతే కేటాయింపులు రద్దు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్య రంగాలతోపాటు సూపర్ సిక్స్ పథకాల అమలులో సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోసం శిక్షణ ఇవ్వడానికి విశాఖ ఐఏఎం ముందుకు వచ్చిందని, స్థానికంగా ఔత్సాహికులను గుర్తించి శిక్షణ ఇప్పించాలన్నారు. జిల్లాలో 1,05,000 మంది బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఆయా కుటుంబాలను మార్గదర్శకులు ఆదుకునేవిధంగా సచివాలయ స్థాయిలో సమావేశాలు ఏర్పాటుచేసి వారికి ఏమి కావాలో గుర్తించి అవసరాలు తీర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కేవలం డబ్బే కాకుండా వారికి అవసరమైన ఏ సహకారాన్ని అయినా అందించవచ్చన్నారు. ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలని, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల కోసం స్థల సేకరణ చర్యలు చేపట్టాలన్నారు. విమానాశ్రయం చుట్టుపక్కల ప్రాంతంలో పక్షులు ఎగురకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జీవీఎంసీ, ఎయిర్‌పోర్టు, ఇరిగేషన్ అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. వీధి లైట్లు వెలగకపోయినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలన్నారు. 28.5 శాతం ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ఫలితాలు ప్రజలకు తెలిసే విధంగా నెలరోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, గురువారం ఉదయం ప్రభుత్వ కార్యాలయాల్లో ఎనిమిది గంటలు నుంచి తొమ్మిది గంటల వరకు ఏక్ దిన్ ఏక్ ఘంటా ఏక్ సాత్ పేరుతో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో భవానీ శంకర్, జిల్లా ఫారెస్ట్ అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్రంపాలెంలో అక్రమ క్వారీయింగ్

... 7వ పేజీ తరువాయి

వివరణ ఇవ్వాలి. ఇందుకు ఏపీఐఐసీ కూడా ప్రత్యేకించి చొరవ తీసుకుని కంపెనీల నుంచి నివేదిక తెప్పించి గనుల శాఖకు పంపాలి. ఈ విషయమై ఏపీఐఐసీకి గనుల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు లేఖలు రాయడంతో పాటు కలెక్టరేట్‌లో కలిసినప్పుడు నోటీసులకు వివరణ గురించి అడుగుతున్నారు. ఇదిలావుండగా గడువులోగా వివరణ రానందున గనుల శాఖ సుమోటోగా ఆయా కంపెనీలకు డిమాండ్ నోటీసులు ఇవ్వవచ్చు. కానీ ఆ శాఖ కూడా నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుర్రంపాలెం లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన కంపెనీలు సమీపంలో కొండల నుంచి సుమారు లక్షన్నర క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినట్టు గనుల శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. అందుకు రూ.కోట్లలో జరిమానా చెల్లించాల్సి ఉంది. ఒకవేళ సకాలంలో జరిమానా చెల్లించకపోతే ఆర్ఆర్ చట్టం కింద ఆస్తుల జప్తునకు నోటీసులు ఇచ్చే అధికారం కూడా గనుల శాఖకు ఉంది. దీనిపై గనుల శాఖ చొరవ తీసుకోవాలి.

జోరుగా కల్వర్టు నిర్మాణ పనులు


మాధవధార వుడా కాలనీలో నిర్మాణం పూర్తయిన కల్వర్టు

మాధవధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీలోని గ్యాస్ గోడౌన్ రోడ్డులో కొత్తగా కల్వర్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. కాలనీలోని ఇళ్లకు వెళ్లేందుకు అదనపు సౌకర్యంగా రోడ్డు రెండో వైపు గెడ్డ మీదుగా కల్వర్టు వేసి 40 అడుగుల మార్గానికి అనుసంధానం చేశారు. రూ.18 లక్షల జీవీఎంసీ నిధులతో పనుల్ని పూర్తిచేస్తున్నారు. గత నెలలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు భూమి పూజ చేసి ఆరంభించిన పనులు వేగంగా పూర్తిచేశారు. గెడ్డ మీదుగా రోడ్డు డెడ్ ఎండ్‌గా ఉన్న వీధి రోడ్డును ఇపుడు 40 అడుగుల దారితో విస్తరించడం వల్ల తేలికపాటి వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనదారులకు సౌకర్యం కలగనుంది. కాలనీవాసులకు అదనపు వసతిగా సమకూరిన కొత్త దారిలో ఇకపై రాకపోకలు కొద్దిరోజుల్లోనే ఆరంభం కానున్నట్లు పనులను పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు తెలియజేశారు. దీంతో కాలనీ ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడనుంది.

ఇంజనీరింగ్ సీట్లు... విద్యార్థుల పాట్లు

(7వ పేజీ తరువాయి)

యాజమాన్యాలపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. కన్వీనర్ కోటాలో సీట్లు దక్కించుకున్నా వేలాది రూపాయలు చెల్లించాల్సి రావడంతో ఇటు విద్యార్థులు, మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చి వెళ్లిపోయే పరిస్థితి రావడంతో అటు యాజమాన్యాలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, సర్టిఫికెట్లు ఇవ్వ కుండా ఇబ్బంది పెట్టకూడదని, ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

జీవీఎంసీలో 10 జోన్‌లు

(7వ పేజీ తరువాయి)

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్‌గార్గ్ వద్ద అధికారులు జోన్‌ల పునర్వ్యవస్థీకరణ అంశాన్ని ప్రస్తావించగా, ఆయన జీవీఎంసీ పరిధిలోని ప్రజా ప్రతినిధులతో చర్చించారు. వారంతా సరేనని చెప్పడంతో నియోజకవర్గాల వారీగా జోన్‌లను పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదన తయారుచేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్లు పలుమార్లు సమావేశమై వార్డులు, జోన్‌ల మ్యాప్‌లను పరిశీలించారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత ఒక నియోజకవర్గం పరిధిలో ఉన్నవార్డులను ఒకే జోన్ పరిధిలోకి మార్చుతూ డ్రాఫ్ట్‌ను తయారుచేశారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో సరిహద్దు వార్డుల్లో ఉండేవారు తమ జోనల్ కార్యాలయాలకు వచ్చిపోవడానికి ఇబ్బందిగా ఉంటుంది కాబట్టి ఆయా నియోజకవర్గాల్లో రెండేసి జోన్‌లు ఉండేలా విభజించారు. తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కో జోనల్ కార్యాలయం ఉండేలా తయారుచేసిన ప్రతిపాదనను గత నెల 22న జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదానికి పెట్టారు. కౌన్సిల్ ఆమోదించి ప్రభుత్వ అనుమతికి పంపించింది. దీనికి రాష్ట్రప్రభుత్వం కూడా దాదాపు అంగీకరించడంతో త్వరలో అధికారిక ఉత్తర్వులు వెల్లడికానున్నాయి. వచ్చేనెల ఏడో తేదీ నాటికి కొత్తజోన్‌లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని, అందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేసుకోవాలని అన్నివిభాగాల అధిపతులకు జీవీఎంసీ కమిషనర్ బుధవారం ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు. కొత్త జోనల్ కార్యాలయాలు ఏర్పాటుకు అవసరమైన భవనాలను గుర్తించడంతోపాటు సిబ్బందిని, ఫర్నీచర్‌ను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించినట్టు సమాచారం.

మాస్టర్ ప్లాన్‌లో మార్పులు

(7వ పేజీ తరువాయి)

విమర్శలు వచ్చాయి. కంటి తుడుపుగా అభ్యంతరాలు స్వీకరించిన వైసీపీ ప్రభుత్వం వాటిని పరిశీలించకుండా పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై దృష్టిసారించింది. చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రణవ్ గోపాల్ నియోజకవర్గాల వారీగా అభ్యంతరాలు స్వీకరించారు. అందులో ఎమ్మెల్యేలను కూడా భాగస్వాములను చేశారు.

పరిశీలన, చర్యలకు శ్రీకారం

వేల సంఖ్యలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్న అధికారులు అన్నింటినీ క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేస్తున్నారు. నిజంగానే తప్పులు జరిగాయా?, ప్రతిపాదించిన రహదారులు అక్కడ అవసరమా?...అనే విషయాలు పరిశీలిస్తున్నారు. వీలైనంత వరకు ప్రభుత్వ భూముల మీదుగానే రహదారులు వెళ్లేలా చూస్తున్నారు. ఇప్పటికే లేఅవుట్లుగా మారిన భూముల మధ్య నుంచే ఏమైనా రహదారులు ఉంటే వాటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో అడ్డగోలు నిర్ణయాలంటూ కొన్ని రహదారులపై తీవ్రమైన చర్చ జరిగింది. వాటిని ఇప్పుడు మార్చేందుకు అధికారులు నిర్ణయించారు.

రుషికొండలో ఏ-1 కన్వెన్షన్ సెంటర్ వైపు...

రుషికొండలో ఏ-1 కన్వెన్షన్ సెంటర్ వద్ద 200 అడుగుల మేర రహదారి విస్తరణకు ప్రతిపాదించారు. అయితే కన్వెన్షన్ సెంటర్‌కు నష్టం రాకుండా రెండో వైపు రహదారి విస్తరణకు అప్పట్లో ప్రతిపాదించారు. దీనిని కూడా ఇప్పుడు అధికారులు సరిచేస్తున్నారు. అటు..ఇటు సమానంగా విస్తరణ చేయడానికి ప్లాన్ సరి చేస్తున్నారు.

దసపల్లా హిల్స్‌లో నేవీ హౌస్‌కు నష్టం లేకుండా

నగరంలో దసపల్లా భూములను వైసీపీ నాయకులు హస్తగతం చేసుకున్న సంగతి తెలిసిందే. అక్కడ అతి పెద్ద అపార్టుమెంట్ల నిర్మాణానికి ప్లాన్ చేసుకున్నారు. అందుకోసం మాస్టర్‌ప్లాన్‌లో 100 అడుగుల రహదారిని ప్రతిపాదించారు. వాస్తవానికి అటు వైపు అంత ట్రాఫిక్ ఉండదు. పైగా విస్తరణ సర్క్యూట్ హౌస్ వైపు లేకుండా, ఎదురుగా ఉన్న నేవీ హౌస్ వైపు ప్రతిపాదించారు. అసలు అక్కడ 100 అడుగుల రహదారి అవసరమే లేదంటూ అక్కడి నివాసితులు కొందరు హైకోర్టుకు వెళ్లారు. దాంతో అక్కడ కూడా సవరణ చేస్తున్నారు. స్థానికులు 60 అడుగులు సరిపోతుందని చెబుతుండగా, అధికారులు 80 అడుగులు ఉంచాలని భావిస్తున్నారు. రెండు వైపుల సమానంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

- పార్క్ హోటల్ జంక్షన్ నుంచి దత్ ఐల్యాండ్ వరకు రహదారి విస్తరణకు రైల్వే గెస్ట్ హౌస్, క్రిస్టియన్ స్కూల్ మాత్రమే అడ్డంకిగా ఉన్నట్టు, మిగిలినవన్నీ ప్రభుత్వ భూముల్లోనే ఉన్నట్టు గుర్తించారు. దాంతో ఆ మార్గం విస్తరణకు లైన్ క్లియర్ అయినట్టుగా చెబుతున్నారు.
- దత్ ఐల్యాండ్ నుంచి జీవీఎంసీ కమిషనర్ బంగ్లా మీదుగా తెలుగుతల్లి ఫ్లైఓవర్ వరకు రహదారిని విస్తరణ చేస్తే సంపత్ వినాయకుడి ఆలయం అడ్డంకిగా ఉంది. ఆ మార్గంలో ఎంవీవీ పీక్ కొత్త రహదారి కోసం భూమిని జీవీఎంసీకి అప్పగించింది. మధ్యలో మరో సంస్థ కూడా అలాగే భూమి విడిచి పెట్టింది. వాటి అలైన్‌మెంట్‌లో ఆ మార్గాన్ని విస్తరించాలని అనుకుంటున్నారు. ఈ మార్గంలో మెట్రో రైలు ప్రాజెక్టు ఉంది. వారు ఎక్కడ మెట్రో స్టేషన్ పెడతారో చూసుకొని దాని ప్రకారం ఈ మార్గం విస్తరించాలని భావిస్తున్నారు.

బిల్డర్‌కు అనుకూలంగా అలైన్‌మెంట్

వేపగుంటలో ఓ బిల్డర్‌కు లబ్ధి చేకూర్చడానికి రహదారి అలైన్‌మెంట్‌ను గతంలో మార్చేశారు. సింహాచలం గోశాల నుంచి వేపగుంట వెళ్లే మార్గం విస్తరణలో ఆ బిల్డర్‌కు నష్టం లేకుండా రెండో వైపు పనులకు ప్రతిపాదించారు. దాన్ని సరిచేసి, ఇరువైపులా సమానంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

- రైల్వే ఆస్పత్రి నుంచి రైల్వే స్టేషన్ వరకు భూములు రైల్వేకి సంబంధించినవి కావడం, అభ్యంతరాలు లేకపోవడంతో దానిని పూర్వం అనుకున్నట్టుగానే విస్తరిస్తారు.
- పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి, ఎలమంచిలి ప్రాంతాలకు మాస్టర్ ప్లాన్‌లో రహదారులు ప్రతిపాదించలేదు. ఆయా ప్రాంతాల నుంచి అభ్యర్థనలు రావడంతో ప్రధాన రహదారులతో అనుసంధాన మార్గాలను ప్రతిపాదిస్తున్నారు.
- విజయనగరం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో నీటి వనరులు గుర్తించారు. అవన్నీ జిరాయితీ భూములుగా తేలడంతో వాటిని మార్చాలని నిర్ణయించారు.

బురద రోడ్లతో వాహనదారుల బేజారు


అడుగు వేయడానికి కూడా వీలు లేని స్థితిలో ఉన్న రోడ్డు

- రామ్‌నగర్‌లో అధ్వానంగా రోడ్లు
- యూజీడీ పనుల అనంతరం మరమ్మతులు చేపట్టకపోవడంతో మట్టితో నిండిన రహదారులు
- చినుకు పడితే బురదమయం
- దిగబడుతున్న వాహనాలు
- రాకపోకలకు సైతం వీలు లేని పరిస్థితి

రామ్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో రహదారులు మరీ దారుణంగా తయారయ్యాయి. రోడ్ల నిండా మట్టి నిండిపోవడంతో చినుకులు పడితే చాలు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోతోంది. వాహనాల చక్రాలు దిగబడిపోతున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు రెండు నెలల క్రితం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు, ఈ పనుల్లో భాగంగా అండర్ గ్రౌండ్‌లో పనులు చేసేందుకు రామ్‌నగర్‌లో ఉన్న పలు సందులతో పాటు ప్రధాన రోడ్లలో తవ్వకాలు చేపట్టి, నెల రోజుల పాటు నింపాదిగా పనులు నిర్వహించారు. ఈ క్రమంలో రోడ్లన్నీ మట్టి మయం అయ్యాయి. యూజీడీ పనుల చేపట్టిన సిబ్బంది ఆ తర్వాత రోడ్ల గురించి పట్టించుకోలేదు. ఎలా ఉన్నది అలాగే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో తవ్వకాలు చేసిన రహదారులు మట్టిమయంగా మారిపోయాయి. చిన్న వర్షం పడినా ఈ ప్రాంతం బురదమయంగా తయారవుతున్నదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. రాకపోకలు సాగించేందుకు వీలు లేని విధంగా రహదారులను మార్చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ రహదారి పరిస్థితే ఇంత దారుణంగా ఉన్నా ఏ అధికారి, ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


బురద రోడ్డుపై దిగబడిన వాహనం


రహదారిపై పేరుకుపోయిన బురద

రహదారులను తవ్వి పనులు చేపట్టిన అధికారులు కాంట్రాక్టరులు పనులు పూర్తయిన తర్వాత రహదారులను మరమ్మతులు చేపట్టకుండా చల్లగా జారుకున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రామ్‌నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

జైలు ఆవరణలో ఖైదీలు పండించిన ఆనపకాయల అమ్మకం


అమ్మకానికి తరలిస్తున్న ఆనపకాయలు

ఆరిలోవ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో జైలు బయట గల వ్యవసాయ క్షేత్రాల్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. వాటిలో ఆనప కాయలు సుమారు ఎకరా స్థలంలో సాగు చేశారు. ఈ పాదుల నుంచి వచ్చిన ఆనప కాయలను కోసి జైలులో ఖైదీలకు కూరలుగా వాడుతారు. బుధవారం సుమారు 400 కిలోల ఆనప కాయలను తూకం వేసి వాటిని జైలు లోకి రిక్షాలో తరలించేందుకు సిద్ధం చేశారు. ఎలాంటి రసాయన ఎరువులు లేకుండా కేవల ఆవు పేడ ఎరువుగా వేసి వీటిని పండించారు. ఇవి తినడానికి రుచికరంగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదు. జైలులో అవసరాలు పోను మిగిలిన ఆనప కాయలను కారాగారం బయట గల సుధార్ క్యాంటిన్‌లో విక్రయించారు. ఒక్కో ఆనపకాయ రూ.20 చొప్పున విక్రయించారు. రైతు బజార్‌లో కంటే తక్కువ ధర కావడంతో వీటిని కొనేందుకు అటుగా వెళుతున్న వారు ఎగబడ్డారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు విక్రయాలు చేపట్టనున్నట్టు జైలు అధికారులు తెలిపారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు

ఆరిలోవ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల దీన దయాళపురంలో వెలసిన విజయ దుర్గా దేవి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి మూడో రోజైన బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంగా ఆలయం అర్చకులు తీర్చి దిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు

ఈ సందర్భంగా అమ్మవారికి గులాబీలతో అలంకరించారు. కార్యక్రమం అలయం అధ్యక్షుడు యల్లమల్లి సురేష్. ఖాదర్ బాషా, గౌతమీ సేవాసంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

16వ వార్డులో ఆపరేషన్ లంగ్స్

- భారీ సంఖ్యలో దుకాణాల తొలగింపు
- చిరు వర్తకుల వాగ్వాదం
- వెనక్కు తగ్గని అధికారులు


ఉద్రిక్త వాతావరణంలో బడ్డీలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

వెంకోజీపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ లంగ్స్ (లైఫ్ టు సేవ్ అర్బన్ గ్రీన్ స్పేసెస్)లో భాగంగా బుధవారం జోన్-3లోని 16వ వార్డులో ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ వరకు రోడ్డుపై ఆక్రమించి ఉన్న బడ్డీలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఉదయం 7 గంటలకే టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బందితో పాటు క్రేన్‌లు, టిప్పర్లు, లారీలు, పోలీసులు కూడా బడ్డీల వద్ద మోహరించారు. కొంతమంది ముందే తేరుకుని గత రెండు మూడు రోజులుగా బడ్డీలు, సామానులను ఖాళీ చేయడం, వీలైనంత వరకు బడ్డీలను తొలగించడం చేశారు. కానీ మరికొంత మంది మార్జిన్ లోపల దుకాణాలు ఉంటే ఏమీ అనరనే ఉద్దేశంలో ఉన్నారు. అయితే అలాంటిదేమీ లేకపోవడంతో ఆయా దుకాణదారులు అయోమయానికి గురయ్యారు. అధికారులతో కొందరు వాదనలకు దిగి తొలగింపును నిలుపుదల చేసే యత్నం చేశారు. కానీ అధికారులు, సిబ్బంది వారి మాటల్ని ఖాతరు చేయకుండా బడ్డీలను తొలగించారు. కొన్ని చోట్ల అక్రమంగా ఇటుక, సిమెంటుతో నిర్మించిన వాటిని టిప్పర్ల సాయంతో నేలమట్టం చేశారు. చాలామంది అక్రమంగా బడ్డీలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చారని సిబ్బంది వెల్లడించారు. వీరివల్ల నిజంగా బడ్డీలపై ఆధారపడి బతికే వారికి అన్యాయం జరుగుతోందని, కానీ వీరికి అన్యాయం జరగకుండా జీవీఎంసీ సముచిత న్యాయం చేస్తోందని బాధితులకు చెప్పారు. రహదారిలో పాదచారుల వంతెనపై ఇటువంటి దుకాణాలతో పాటు, ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న బడ్డీలను తొలగించి లారీల్లో తరలించారు.

కనకమహాలక్ష్మికి లక్ష చామంతులతో పూజ


అమ్మవారికి పూజ చేస్తున్న మద్దినేని సురేష్‌భాను, మాధవి దంపతులు

మహారాణిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి బుధవారం లక్ష చామంతులతో పూజ చేశారు. ఈ పూలను విజన్ డెవలపర్స్ సంస్థ ఎండీ మద్దినేని సురేష్‌భాను, మాధవి దంపతులు సమకూర్చారు. ఆలయ అర్చకులు సురేష్‌భాను దంపతులతో ప్రత్యేక పూజ చేయించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు, వేదాశీర్వచనాలు అందజేశారు.

చిరువర్తకులను యాచకులుగా మార్చవద్దు

- జోన్-2 కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన


సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కొమ్మాది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిరువర్తకులను యాచకులుగా మార్చవద్దని, తమ కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని నినదిస్తూ చిల్లర వర్తకులు, తోపుడుబండ్ల కార్మికులు జీవీఎంసీ జోన్-2 కార్యాలయం వద్ద అభ్యర్థించారు. బుధవారం మధురవాడ పరిసర ప్రాంత చిల్లర వర్తకులు జోనల్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. జెడ్సీ ఇచ్చిన మాట ప్రకారం తాత్కాలికంగా వర్తకం చేసుకునేందుకు అనుమతించాలని నినదించారు. సర్వీస్ రహదారిపై బైఠాయించి 'బాబ్బాబు' అంటూ భిక్షాటన చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటంతో పి.ఎం.పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీఐటీయూ నాయకులు అప్పలరాజు, రాజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. బాధితులు పోలీస్ వాహనానికి అడ్డుగా కూర్చుని నినాదాలు చేయటంతో ఉద్రిక్తత ఏర్పడింది. జెడ్సీని పిలిపిస్తామని తెలపటంతో జెడ్సీ చాంబర్ వద్ద బైఠాయించారు. వారు మాట్లాడుతూ అప్పులు తెచ్చుకుని వర్తకం చేసుకుంటూ జీవించేవారిని తీవ్రంగా దెబ్బతీశారని అన్నారు. వెంటనే హాకర్ల జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమను వ్యాపారం చేసుకోనివ్వాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ చుట్టుపక్కల ప్రాంతాల చిరువర్తకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో కంబాలకొండలో రెండు అతిథి గృహాలు

- సందర్శకుల విడిది కోసం నిర్మాణం


నిర్మాణ దశలో ఉన్న గెస్ట్‌హౌస్‌లు

ఆరిలోవ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ పార్కులో సందర్శకులు విడిది చేసేందుకు రెండు గెస్ట్ హౌస్‌లు నిర్మిస్తున్నారు. ఈ రెండు గెస్ట్ హౌస్‌లకు రూ.18 లక్షల వన సంరక్షణ నిధుల నుంచి నిర్మాణం చేస్తున్నట్టు కంబాకొండ అటవీ శాఖాధికారులు తెలిపారు. గతంలో మూడు గెస్ట్ హౌసులు పూర్తి స్థాయిలో అన్ని సౌకర్యాలతో నిర్మించారు. అయితే అవి ఇంతవరకూ సందర్శకులకు అందుబాటులోకి తీసుకు రాలేదు.

చిన్న రుషికొండలో బడ్డీల తొలగింపు


చిన్నరుషికొండలో తొలగిస్తున్న బడ్డీలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ చేపట్టిన ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా ఫుట్‌పాత్‌లపై బడ్డీల తొలగింపు కార్యక్రమం బుధవారం జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పర్యవేక్షణలో కొనసాగింది. బడ్డీలు తొలగిస్తుండగా దుకాణదార్లు ప్రాధేయపడ్డారు. స్వచ్ఛందంగా తొలగించుకోవడానికి కాస్త సమయమివ్వడంతో కొందరు తమ వస్తువులను తరలించారు. తొలగించని దుకాణదార్ల బడ్డీలనుటౌన్‌ప్లానింగ్ సిబ్బంది క్రేన్‌లతో లారీలపైకి ఎక్కించి దుకాణదార్లు కోరిన చోటకు తరలించారు. మరికొంతమంది బడ్డీలను వ్యాన్‌లలో ఇతర ప్రాంతాలకు తరలించారు. బడ్డీలను తొలగించిన చోట మళ్లీ పెట్టకుండా ఆ ప్రాంతాలను జేసీబీ సహాయంతో దున్నించారు. బడ్డీలను తొలగించడం వలన జీవనోపాధి కోల్పోయామని బడ్డీవ్యాపారులు లబోదిబోమన్నారు. మధురవాడ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రాజు, నాయుడు, సచివాలయ సెక్రటరీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓజి** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

రోడ్లపై యథేచ్ఛగా పశువుల సంచారం

- నియంత్రణపై దృష్టి సారించని అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు


రాత్రి వేళ హెచ్‌బీ కాలనీ రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వాహనచోదకులకు వేగాన్ని నిరోధించేందుకుజీవీఎంసీ, పోలీసు శాఖ వారు స్పీడ్ బ్రేకర్‌లను రోడ్లపై ఏర్పాటు చేస్తారు. కానీ వాహనచోదకుల ప్రాణాలతో చెలగాటం ఆడేందుకు కదిలే వేగనిరోధకాలు అంటే రోడ్లపై పశువుల సంచారం ఎక్కువ అవుతోంది. జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ సులభ్ కాంప్లెక్సు ప్రాంతంలోని పశువుల సంచారం ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇది వరకే ఇక్కడ రోడ్లపై ఆవులు పడుకుని ఉండడంతో రాత్రి పూట రోడ్డు ఖాళీగా ఉండటం వల్ల వేగంగా వచ్చే వాహనచోదకులు ఈ రోడ్లపై నిద్రించే గోవులు కనిపించక ప్రమాదాలకు గురి కావడమే కాకుండా ఒకరిద్దరు ప్రాణాలను కూడా కోల్పోయారు. సరిగ్గా రెండేళ్ల క్రితం (సెప్టెంబరు 4, 2023) రాత్రి 12 గంటలకు స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలో పాల్గొని వస్తున్న యువకుడు వెంకటేష్ రోడ్డుపై నిద్రిస్తున్న గోవును ఢీకొని గాలిలో ఎగిరి నేలపై పడడంతో అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయాడు. ఈ ప్రమాదంలో ఆవు కూడా మరణించింది. ఆ తరువాత కొంతకాలం ఆవులను నిరోధించారు.

కానీ మళ్లీ మామూళ్లగానే ఆవులను రోడ్లపైకి వదిలేస్తున్నారు. వాటి వల్ల సంపాదన అర్జిస్తున్న గోవుల యజమానులు తమ అవసరం తీరాక ఇలా రోడ్లపైకి వదిలేయడంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వాహనచోదకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న గోవుల యజమానులపై కఠిన చర్యలు చేపట్టాలని అంటున్నారు.

'ఆపరేషన్ లంగ్స్' కొనసాగింపు


బడ్డీలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కొమ్మాది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో జీవీఎంసీ నిర్వహిస్తున్న బడ్డీల తొలగింపు కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఇప్పటికే మిథిలాపురి ఉడాకాలనీ, కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డులో దుకాణాలు తొలగించిన జీవీఎంసీ సిబ్బంది బుధవారం శివశక్తినగర్ రోడ్డులో జోన్-2 ఎ.సి.పి. శాస్త్రి ఆధ్వర్యంలో బడ్డీలు, తోపుడుబండ్లను తొలగించారు. బడ్డీలను, తోపుడుబండ్లు రోడ్డుపక్క ఉన్నా అనుమతించబోమని, మధురవాడలోని అన్ని రహదారులలో ఈ ఆపరేషన్ లంగ్స్ కొనసాగుతుందని ఎ.సి.పి. స్పష్టం చేశారు.

ట్రంప్ ఒత్తిళ్లకు మోదీ తలొగ్గరు : బీజేపీ నేత వెంకటరావు

మురళీనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృత్తి నిపుణులను ఆహ్వానిస్తూ 35 సంవత్సరాల క్రితం తీసుకొచ్చిన హెచ్ 1 బి వీసా విధానం సరికొత్త ఆవిష్కరణలకు నెలవై, అమెరికా దేశపు పరపతిని పెంచిందని బీజేపీ నాయకుడు మూల.వెంకటరావు పేర్కొన్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అంటూ వలస వ్యతిరేక జాతీయ వాదంతో అమెరికా ఇపుడు హెచ్ 1 బి వీసాలకు సంబంధించి కఠినమైన నిబంధనల్ని విధించిందని, వీసా రుసుం పెంపు నిర్ణయం అమెరికాలో ఇప్పటికే స్థిర పడిన వారితో సైతం కొత్తగా అక్కడకు వెళ్లే వారికి నష్టదాయకంగా తయారైందని అన్నారు. హెచ్ 1బి వీసాదారుల్లో 71 శాతం ఇండియా వారేనని తెలిసే అమెరికా ఇలా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. పైకి మిత్ర దేశం అంటూనే, భారత్‌పై పగబట్టారని అన్నారు. భారత్ విధానాలపై ట్రంప్ అసహనంతో ఇలాంటి చర్యలకు దిగినా దేశ ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోరని పేర్కొన్నారు. అమెరికాలో ఉన్న అత్యధిక శాతం విదేశీయులేనని పేర్కొన్న మూల వెంకటరావు భారత్‌లో వ్యతిరేకత పెంచాలన్న ప్రయత్నమే ఈ నిర్ణయమన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ

భీమునిపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్, టు, త్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ మాట్లాడుతూ జాతీయ సేవా సమితి యువతలో సామాజిక బాధ్యతను, దేశభక్తిని, సమాజ సేవా తత్పరతను పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రవీణ, అప్పలనాయుడు, శ్రీను, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నపూర్ణాదేవిగా అలంకరించిన వన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



సీతమ్మధారలో మీనాక్షి అమ్మవారి అలంకరణలో దుర్గాదేవి



వామనమూర్తిగా దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి



దాబాగార్డెన్స్‌లో అన్నపూర్ణాదేవి అవతారంలో ఉమాదేవి

కాశీ అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు

మహారాణిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడో రోజు బుధవారం కాశీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు పాలు, పెరుగు, గంధం, పసుపు కుంకుమలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో కలిపి 108 ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో అమ్మవారిని కాశీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఆలయంలో ప్రత్యేకంగా 150 బియ్యం బస్తాలతో గర్భాలయాన్ని సుందరంగా అలంకరించారు. సాయంత్రం దేవాలయంలో 250 మంది మహిళలతో వాసవి కనకదుర్గకు కోటి కుంకుమార్చన, హోమం జరిపించి, అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్ పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. గురువారం కన్యకాపరమేశ్వరీ అమ్మవారు ఉడుపి శ్రీకృష్ణుడిగా దర్శనమిస్తారు.

మీనాక్షి, వామనమూర్తి రూపాల్లో దర్శనం

సీతమ్మధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్ రోడ్డులో గల షిరిడి సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా అయ్యవారిని వామనమూర్తిగా, దుర్గాదేవిని మీనాక్షి దేవిగా అలంకరించారు. భక్తులు ఆలయానికి విచ్చేసి పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివరామకృష్ణ దేవాలయంలో వేంచేసిన ఉమాదేవి అమ్మవారు బుధవారం భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజ, సాయంత్రం హారతులు నిర్వహించారు. ఆలయ ఈవో రమాబాయి సారథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి జి.మన్మథరెడ్డి, అర్చకులు భార్గవశర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

మహాశివలింగానికి ఇత్తడి కవచం, తోరణం వితరణ

సీతమ్మధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):: నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహాశివలింగానికి ఆలయ ప్రధాన అర్చకులు రామారావు శర్మ, లక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు ఇత్తడితో కవచం, మకర తోరణం, త్రిశూలం, ఢమరుకాన్ని వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహకాధికారి బండారు ప్రసాద్‌కు ఆభరణాలను అందచేశారు. మహాశివలింగానికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామారావు శర్మ జన్మదినం నేపథ్యంలో దేవుని సన్నిదిలో సేవా నిమిత్తం ఆభరణాలను అందచేసినట్లు దాత కుటుంబ సభ్యులు తెలిపారు.



బహూకరించిన ఇత్తడి కవచం, తోరణంతో శివలింగానికి అలంకరణ

జోరుగా కల్వర్టు నిర్మాణ పనులు



మాధవధార వుడా కాలనీలో నిర్మాణం పూర్తయిన కల్వర్టు

మాధవధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీలోని గ్యాస్ గోడౌన్ రోడ్డులో కొత్తగా కల్వర్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. కాలనీలోని ఇళ్లకు వెళ్లేందుకు అదనపు సౌకర్యంగా రోడ్డు రెండో వైపు గెడ్డ మీదుగా కల్వర్టు వేసి 40 అడుగుల మార్గానికి అనుసంధానం చేశారు. రూ.18 లక్షల జీవీఎంసీ నిధులతో పనుల్ని పూర్తిచేస్తున్నారు. గత నెలలో ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు భూమి పూజ చేసి ఆరంభించిన పనులు వేగంగా పూర్తిచేశారు. గెడ్డ మీదుగా రోడ్డు డెడ్ ఎండ్‌గా ఉన్న వీధి రోడ్డును ఇపుడు 40 అడుగుల దారితో విస్తరించడం వల్ల తేలికపాటి వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనదారులకు సౌకర్యం కలగనుంది. కాలనీవాసులకు అదనపు వసతిగా సమకూరిన కొత్త దారిలో ఇకపై రాకపోకలు కొద్దిరోజుల్లోనే ఆరంభం కానున్నట్లు పనులను పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు తెలియజేశారు. దీంతో కాలనీ ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడనుంది.

ఇంజనీరింగ్ సీట్లు... విద్యార్థుల పాట్లు

(7వ పేజీ తరువాయి)

యాజమాన్యాలపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. కన్వీనర్ కోటాలో సీట్లు దక్కించుకున్నా వేలాది రూపా యలు చెల్లించాల్సి రావడంతో ఇటు విద్యార్థులు, మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చి వెళ్లిపోయే పరిస్థితి రావడంతో అటు యాజమాన్యాలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, సర్టిఫికెట్లు ఇవ్వ కుండా ఇబ్బంది పెట్టకూడదని, ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

విద్యార్థినులు సేవాభావాన్ని అలవరుచుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. సేవా భావాన్ని అలవరుచుకోవాలని, సాటి మనుషులపట్ల సానుభూతి, సౌభ్రాతృత్వం కనబరిచి చిత్తశుద్ధితో జీవించాలని అన్నారు. అనంతరం 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా ,సెయింట్ జోసెఫ్ కళాశాల ఆధ్వర్యంలో అక్షయ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 250మంది స్థానికులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.మాణిక్య కుమారి, వలంటీర్లు, ఆసుపత్రి ప్రతినిధి హరి, వైద్యసిబ్బంది వెలంగణిరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటే ప్రోత్సాహకం అందిస్తాం: సేవా రజనీ



విద్యార్థినికి నోట్ పుస్తకాలు అందజేస్తున్న పైడి రజనీ తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న ప్రతీ ఒక్కరికీ ప్రోత్సాహం అవసరమని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవా) అధ్యక్షురాలు పైడి రజనీ అన్నారు. బుధవారం వన్‌టౌన్ పరిధిలోని ఏవీఎన్ కళాశాలలో 200 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులు పలువురికి శక్తి సంస్థ తరపున ఫీజులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అధ్యాపకులు డాక్టర్ అర్చన, ఎస్.ఇందిర, అప్పారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్రైమ్ ఎస్ఐ రాజు

సీతంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ నాలుగో లైన్‌లో గల గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల్లో ద్వారకా క్రైమ్ పోలీసులు బుధవారం దొంగతనాలు, నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన క్రైమ్ ఎస్ఐ రాజు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, సెల్ ఫోనులో వచ్చే ఫ్రాడ్ లింక్స్‌ను క్లిక్ చేయకుండా ఉండాలని, అపరిచితులు తారస పడి బ్యాంక్, ఆధార్ తదితర అంశాల గురించి అడిగితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

సీతమ్మధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ చేపట్టిన ఆపరేషన్ లంగ్స్ కార్యక్రమంలో భాగంగా సీతమ్మధార రైతుబజార్ సమీపంలో తోపుడు బండ్లు, చిరువ్యాపారుల బండ్లను బుధవారం తొలగించారు. సీతమ్మధార ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లపై గల, రోడ్డును అక్రమించి పెట్టిన బండ్లను, బడ్డీలను తొలగించారు. దీంతో రహదారి విశాలంగా కనిపించడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు మాత్రం 'ఇదేం అన్యాయం' అంటూ అవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదనరావు పర్యవేక్షణలో సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.



లక్ష్మీనారాయణపురంలో ఆక్రమణలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

46వ వార్డులో బడ్డీలు తొలగింపు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీలో భాగంగా గ్రేటర్ 46వ వార్డులో రోడ్డుపై ఏర్పాటు చేసిన తోపుడు బళ్ళు, బడ్డీలను బుధవారం జీవీఎంసీ అధికారులు తొలగించారు. జీవీఎంసీ నిర్మించిన డ్రైనేజీలపై సిమెంట్ దిమ్మలు వేసి ఏర్పాటు చేసిన బడ్డీలను సైతం తొలగించారు. వార్డు పరిధిలోని లక్ష్మీనారాయణపురంలో బడ్డీలు, తోపుడు బళ్లను తొలగించేటప్పుడు ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలీసుల బందోబస్తు మధ్యలో వీటిని తొలగించారు.

అలరించిన కథా కచేరి



సమావేశంలో మాట్లాడుతున్న భాగవతుల సత్యనారాయణ మూర్తి

సీతంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్ర నగర్‌లో గల ప్రిజమ్ డిగ్రీ కళాశాల్లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రచయితల స్వీయ కథా పఠనం, కథా కచేరి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సభకు భాగవతుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహిస్తూ కథను నిర్వచించి మంచి కథా లక్షణాలను విశదీకరించారు. కథా కచేరిలో చల్లా రాంబాబు పందిరి మంచం, భాగవతుల సత్యనారాయణ మూర్తి పరంధామయ్య గారి బస్సు ప్రయాణం, చిన సూర్యనారాయణ పోయినోళ్లందరూ మంచోళ్ళు, రాంపిళ్ల శివాజీ అమ్మ, ఎం.పరమేశ్వరరావు నాయనోరు, గుంటూరు సత్యనారాయణమూర్తి భార్య సోమంచి, వినయ భూషణరావు స్వాతంత్ర్యం ఖరీదు, డాక్టర్ కేవీఎస్ చావుతప్పి లొట్ట, డీఎస్ కుమార్ మానవీయతపై కథలను వినిపించారు. చల్లా రాంబాబు సమీక్షించగా లలితా వాశిష్ట క్షమయా ధరిత్రి కథను విశ్లేషించారు.

కనకమహాలక్ష్మికి లక్ష చామంతులతో పూజ



అమ్మవారికి పూజ చేస్తున్న మద్దినేని సురేష్‌భాను, మాధవి దంపతులు

మహారాణిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి బుధవారం లక్ష చామంతులతో పూజ చేశారు. ఈ పూలను విజన్ డెవలపర్స్ సంస్థ ఎండీ మద్దినేని సురేష్‌భాను, మాధవి దంపతులు సమకూర్చారు. ఆలయ అర్చకులు సురేష్‌భాను దంపతులతో ప్రత్యేక పూజ చేయించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు, వేదాశీర్వచనాలు అందజేశారు.

మాధవధారలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు దీపికా శ్యామల, సునీల్, వైద్య సిబ్బంది తదితరులు

మాధవధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాధవధార అంబేడ్కర్ కాలనీ యూపీహెచ్‌సీలో బుధవారం ఆరోగ్యవంత మహిళ..శక్తివంతమైన కుటుంబం (స్వస్థ్ నారీ సశక్త్ పరివార్) కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహార పంపిణీ విధానంతో పాటు అంగన్వాడీ లబ్ధిదారుల వివరాల్ని బీజేపీ నాయకులు దీపికా శ్యామల, సునీల్ అగర్వాల్ అడిగి తెలుసుకున్నారు. 100 రోజుల పాటు మహిళల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ దిశగా ఈ కార్యక్రమం అమలవుతుందని అంబేడ్కర్ కాలనీ వైద్యుడు వెంకటేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా, అంగన్వాడీ, లాబ్ సిబ్బంది, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'రాజ్యాధికారంతోనే అణగారిన వర్గాలకు విముక్తి'

సీతంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారం పొందితేనే అణగారిన వర్గాలకు విముక్తి అని అంబేడ్కర్ భావించారని ఆ దిశగానే ఆయన పోరాటం చేశారని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో ఏఎంసీ ఆధ్వర్యంలో 'పుణే ఒడంబడిక దళిత రాజకీయాలపై దాని ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దళితులు ఆర్థిక శక్తిగా ఎదగాలంటే ప్రత్యేక ఓటింగ్ పద్ధతి ద్వారా తమ అభ్యర్థులను తామే ఎన్నుకునే విధానం అమలు జరిగి ఉంటే నిజమైన దళిత ప్రతినిధులు ఎన్నికయ్యే వారని పేర్కొన్నారు. ఏఎంసీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఆచార్య అర్జున్, సత్యనారాయణ, ఎస్ సుధాకర్, మహేష్, వేమన తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు డివిజన్‌లో సీఆర్ఎస్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న సౌత్ ఈస్ట్రన్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్ మిశ్రా, డీఆర్ఎం బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని రాయగడ, విజయనగరం మూడో లైను ప్రాజెక్టుకు సంబంధించి డొంకినవలస-బొబ్బిలి మధ్య 12 కి.మీ నిడివిలో కొత్తగా విద్యుదీకరించిన లైనును సౌత్ ఈస్ట్రన్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ (సీఆర్ఎస్) బ్రిజేష్‌కుమార్ మిశ్రా తనిఖీ చేశారు. బుధవారం పర్యటించిన ఆయన 25 టీ యాక్సిల్ లోడ్‌కు అనుగుణంగా కొత్తగా నిర్మించిన పట్టాలు, వంతెనలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన స్పీడ్ ట్రయిల్ విజయవంతం కావడంతో రైళ్ల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేషన్ యార్డులు, హై లెవెల్ ప్లాట్‌ఫామ్‌లు, వంతెనల వద్ద వేసిన కొత్త క్రాస్ ఓవర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు అంకుష్ గుప్తా, అశోక్‌కుమార్, ఎస్.కె.పాత్రో తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి నూతన ప్రణాళికలు

... 7వ పేజీ తరువాయి

రెండు, మూడు రోజులు ఇక్కడ ఉండేలా అడ్వంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుచేయాలని, మూడు నెలల్లో రెండు క్యారవాన్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టూరిజం కోసం భూములు తీసుకున్నవారు కార్యకలాపాలు ప్రారంభించాలని, లేకపోతే కేటాయింపులు రద్దు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్య రంగాలతోపాటు సూపర్ సిక్స్ పథకాల అమలులో సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోసం శిక్షణ ఇవ్వడానికి విశాఖ ఐఏఎం ముందుకు వచ్చిందని, స్థానికంగా ఔత్సాహికులను గుర్తించి శిక్షణ ఇప్పించాలన్నారు. జిల్లాలో 1,05,000 మంది బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఆయా కుటుంబాలను మార్గదర్శకులు ఆదుకునేవిధంగా సచివాలయ స్థాయిలో సమావేశాలు ఏర్పాటుచేసి వారికి ఏమి కావాలో గుర్తించి అవసరాలు తీర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కేవలం డబ్బే కాకుండా వారికి అవసరమైన ఏ సహకారాన్ని అయినా అందించవచ్చన్నారు. ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలని, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల కోసం స్థల సేకరణ చర్యలు చేపట్టాలన్నారు. విమానాశ్రయం చుట్టుపక్కల ప్రాంతంలో పక్షులు ఎగురకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జీవీఎంసీ, ఎయిర్‌పోర్టు, ఇరిగేషన్ అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. వీధి లైట్లు వెలగకపోయినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలన్నారు. 28.5 శాతం ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ఫలితాలు ప్రజలకు తెలిసే విధంగా నెలరోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, గురువారం ఉదయం ప్రభుత్వ కార్యాలయాల్లో ఎనిమిది గంటలు నుంచి తొమ్మిది గంటల వరకు ఏక్ దిన్ ఏక్ ఘంటా ఏక్ సాత్ పేరుతో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో భవానీ శంకర్, జిల్లా ఫారెస్ట్ అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్రంపాలెంలో అక్రమ క్వారీయింగ్

... 7వ పేజీ తరువాయి

వివరణ ఇవ్వాలి. ఇందుకు ఏపీఐఐసీ కూడా ప్రత్యేకించి చొరవ తీసుకుని కంపెనీల నుంచి నివేదిక తెప్పించి గనుల శాఖకు పంపాలి. ఈ విషయమై ఏపీఐఐసీకి గనుల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు లేఖలు రాయడంతో పాటు కలెక్టరేట్‌లో కలిసినప్పుడు నోటీసులకు వివరణ గురించి అడుగుతున్నారు. ఇదిలావుండగా గడువులోగా వివరణ రానందున గనుల శాఖ సుమోటోగా ఆయా కంపెనీలకు డిమాండ్ నోటీసులు ఇవ్వవచ్చు. కానీ ఆ శాఖ కూడా నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుర్రంపాలెం లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన కంపెనీలు సమీపంలో కొండల నుంచి సుమారు లక్షన్నర క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినట్టు గనుల శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. అందుకు రూ.కోట్లలో జరిమానా చెల్లించాల్సి ఉంది. ఒకవేళ సకాలంలో జరిమానా చెల్లించకపోతే ఆర్ఆర్ చట్టం కింద ఆస్తుల జప్తునకు నోటీసులు ఇచ్చే అధికారం కూడా గనుల శాఖకు ఉంది. దీనిపై గనుల శాఖ చొరవ తీసుకోవాలి.

జీవీఎంసీలో 10 జోన్‌లు

(7వ పేజీ తరువాయి)

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్‌గార్గ్ వద్ద అధికారులు జోన్‌ల పునర్వ్యవస్థీకరణ అంశాన్ని ప్రస్తావించగా, ఆయన జీవీఎంసీ పరిధిలోని ప్రజా ప్రతినిధులతో చర్చించారు. వారంతా సరేనని చెప్పడంతో నియోజకవర్గాల వారీగా జోన్‌లను పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదన తయారుచేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్లు పలుమార్లు సమావేశమై వార్డులు, జోన్‌ల మ్యాప్‌లను పరిశీలించారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత ఒక నియోజకవర్గం పరిధిలో ఉన్నవార్డులను ఒకే జోన్ పరిధిలోకి మార్చుతూ డ్రాఫ్టను తయారుచేశారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో సరిహద్దు వార్డుల్లో ఉండేవారు తమ జోనల్ కార్యాలయాలకు వచ్చిపోవడానికి ఇబ్బందిగా ఉంటుంది కాబట్టి ఆయా నియోజకవర్గాల్లో రెండేసి జోన్‌లు ఉండేలా విభజించారు. తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కో జోనల్ కార్యాలయం ఉండేలా తయారుచేసిన ప్రతిపాదనను గత నెల 22న జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదానికి పెట్టారు. కౌన్సిల్ ఆమోదించి ప్రభుత్వ అనుమతికి పంపించింది. దీనికి రాష్ట్రప్రభుత్వం కూడా దాదాపు అంగీకరించడంతో త్వరలో అధికారిక ఉత్తర్వులు వెల్లడికానున్నాయి. వచ్చేనెల ఏడో తేదీ నాటికి కొత్తజోన్‌లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని, అందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేసుకోవాలని అన్నివిభాగాల అధిపతులకు జీవీఎంసీ కమిషనర్ బుధవారం ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు. కొత్త జోనల్ కార్యాలయాలు ఏర్పాటుకు అవసరమైన భవనాలను గుర్తించడంతోపాటు సిబ్బందిని, ఫర్నీచర్‌ను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించినట్టు సమాచారం.

మాస్టర్ ప్లాన్‌లో మార్పులు

(7వ పేజీ తరువాయి)

విమర్శలు వచ్చాయి. కంటి తడుపుగా అభ్యంతరాలు స్వీకరించిన వైసీపీ ప్రభుత్వం వాటిని పరిశీలించకుండా పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై దృష్టిసారించింది. చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రణవ్ గోపాల్ నియోజకవర్గాల వారీగా అభ్యంతరాలు స్వీకరించారు. అందులో ఎమ్మెల్యేలను కూడా భాగస్వాములను చేశారు.

పరిశీలన, చర్యలకు శ్రీకారం

వేల సంఖ్యలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్న అధికారులు అన్నింటినీ క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేస్తున్నారు. నిజంగానే తప్పులు జరిగాయా?, ప్రతిపాదించిన రహదారులు అక్కడ అవసరమా?...అనే విషయాలు పరిశీలిస్తున్నారు. వీలైనంత వరకు ప్రభుత్వ భూముల మీదుగానే రహదారులు వెళ్లేలా చూస్తున్నారు. ఇప్పటికే లేఅవుట్లుగా మారిన భూముల మధ్య నుంచే ఏమైనా రహదారులు ఉంటే వాటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో అడ్డగోలు నిర్ణయాలంటూ కొన్ని రహదారులపై తీవ్రమైన చర్చ జరిగింది. వాటిని ఇప్పుడు మార్చేందుకు అధికారులు నిర్ణయించారు.

రుషికొండలో ఏ-1 కన్వెన్షన్ సెంటర్ వైపు...

రుషికొండలో ఏ-1 కన్వెన్షన్ సెంటర్ వద్ద 200 అడుగుల మేర రహదారి విస్తరణకు ప్రతిపాదించారు. అయితే కన్వెన్షన్ సెంటర్‌కు నష్టం రాకుండా రెండో వైపు రహదారి విస్తరణకు అప్పట్లో ప్రతిపాదించారు. దీనిని కూడా ఇప్పుడు అధికారులు సరిచేస్తున్నారు. అటు..ఇటు సమానంగా విస్తరణ చేయడానికి ప్లాన్ సరి చేస్తున్నారు.

దసపల్లా హిల్స్‌లో నేవీ హౌస్‌కు నష్టం లేకుండా

నగరంలో దసపల్లా భూములను వైసీపీ నాయకులు హస్తగతం చేసుకున్న సంగతి తెలిసిందే. అక్కడ అతి పెద్ద అపార్టుమెంట్ల నిర్మాణానికి ప్లాన్ చేసుకున్నారు. అందుకోసం మాస్టర్‌ప్లాన్‌లో 100 అడుగుల రహదారిని ప్రతిపాదించారు. వాస్తవానికి అటు వైపు అంత ట్రాఫిక్ ఉండదు. పైగా విస్తరణ సర్క్యూట్ హౌస్ వైపు లేకుండా, ఎదురుగా ఉన్న నేవీ హౌస్ వైపు ప్రతిపాదించారు. అసలు అక్కడ 100 అడుగుల రహదారి అవసరమే లేదంటూ అక్కడి నివాసితులు కొందరు హైకోర్టుకు వెళ్లారు. దాంతో అక్కడ కూడా సవరణ చేస్తున్నారు. స్థానికులు 60 అడుగులు సరిపోతుందని చెబుతుండగా, అధికారులు 80 అడుగులు ఉంచాలని భావిస్తున్నారు. రెండు వైపుల సమానంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

- పార్క్ హోటల్ జంక్షన్ నుంచి దత్ ఐల్యాండ్ వరకు రహదారి విస్తరణకు రైల్వే గెస్ట్ హౌస్, క్రిస్టియన్ స్కూల్ మాత్రమే అడ్డంకిగా ఉన్నట్టు, మిగిలినవన్నీ ప్రభుత్వ భూముల్లోనే ఉన్నట్టు గుర్తించారు. దాంతో ఆ మార్గం విస్తరణకు లైన్ క్లియర్ అయినట్టుగా చెబుతున్నారు.
- దత్ ఐల్యాండ్ నుంచి జీవీఎంసీ కమిషనర్ బంగ్లా మీదుగా తెలుగుతల్లి ఫ్లైఓవర్ వరకు రహదారిని విస్తరణ చేస్తే సంపత్ వినాయకుడి ఆలయం అడ్డంకిగా ఉంది. ఆ మార్గంలో ఎంవీవీ పీక్ కొత్త రహదారి కోసం భూమిని జీవీఎంసీకి అప్పగించింది. మధ్యలో మరో సంస్థ కూడా అలాగే భూమి విడిచి పెట్టింది. వాటి అలైన్‌మెంట్‌లో ఆ మార్గాన్ని విస్తరించాలని అనుకుంటున్నారు. ఈ మార్గంలో మెట్రో రైలు ప్రాజెక్టు ఉంది. వారు ఎక్కడ మెట్రో స్టేషన్ పెడతారో చూసుకొని దాని ప్రకారం ఈ మార్గం విస్తరించాలని భావిస్తున్నారు.

బిల్డర్‌కు అనుకూలంగా అలైన్‌మెంట్

వేపగుంటలో ఓ బిల్డర్‌కు లబ్ధి చేకూర్చడానికి రహదారి అలైన్‌మెంట్‌ను గతంలో మార్చేశారు. సింహాచలం గోశాల నుంచి వేపగుంట వెళ్లే మార్గం విస్తరణలో ఆ బిల్డర్‌కు నష్టం లేకుండా రెండో వైపు పనులకు ప్రతిపాదించారు. దాన్ని సరిచేసి, ఇరువైపులా సమానంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

- రైల్వే ఆస్పత్రి నుంచి రైల్వే స్టేషన్ వరకు భూములు రైల్వేకి సంబంధించినవి కావడం, అభ్యంతరాలు లేకపోవడంతో దానిని పూర్వం అనుకున్నట్టుగానే విస్తరిస్తారు.
- పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి, ఎలమంచిలి ప్రాంతాలకు మాస్టర్ ప్లాన్‌లో రహదారులు ప్రతిపాదించలేదు. ఆయా ప్రాంతాల నుంచి అభ్యర్థనలు రావడంతో ప్రధాన రహదారులతో అనుసంధాన మార్గాలను ప్రతిపాదిస్తున్నారు.
- విజయనగరం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో నీటి వనరులు గుర్తించారు. అవన్నీ జిరాయితీ భూములుగా తేలడంతో వాటిని మార్చాలని నిర్ణయించారు.



లోవమ్మకు వీల్ చైర్ అందజేసిన దృశ్యం

దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేత

అగనంపూడి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకకు చెందిన దివ్యాంగురాలు అమరపిన్ని లోవమ్మకు దాత గుదే లక్ష్మణ్ ఆర్థిక సాయంతో వీల్ చైర్, నిత్యావసర సరకులను బుధవారం స్థానిక నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విందుల చిరురాజు, ఎ.గోవింద్, విందుల నారాయణరావు, అప్పలరాజు, బాబ్జీ, ఎం.సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ

పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉక్కు విశ్రాంతి ఉద్యోగి పెదిరెడ్ల హరినాథ్ ఆర్థిక సాయంతో పలువురు పేదలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు గుదే సుశీల గజేంద్రరరావు, ప్రతినిధులు శీరంశెట్టి గోవిందరావు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అతి వేగం ప్రాణాంతకమని, అందువల్ల ద్విచక్ర వాహనదారులందరూ విధిగా హెల్మెట్ ధరించాలని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు కోరారు. బుధవారం దువ్వాడలో ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా రహదారి భద్రతా నిబంధనలను చలానాలు పెండింగ్‌లో ఉంటే క్లియర్ చేసుకోవాలని, ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, ర్యాష్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ఎవరైనా అలా పట్టుబడితే వారికి అవగాహన కల్పించడంతో పాటు జరిమానాలు విధిస్తున్నామన్నారు. కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని, తమ వెంట లైసెన్సు, సీ-బుక్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలను ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1,00,116 విరాళం



దాత మహేశ్‌కు బాండ్ అందజేస్తున్న సునీల్

సింహాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన మండవ మహేశ్ అనే భక్తుడు రూ.1,00,116ను విరాళాన్ని బుధవారం ప్రజా సంబంధా విభాగం పర్యవేక్షణాధికారి సునీల్‌కు అందజేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబీకులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించి శేషవస్త్రంతో సత్కరించి, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందించారు.

సినిమా గైడ్

- **ఓజీ** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280



70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్న మహాదుర్గ



అగనంపూడి పోస్టాఫీసు వద్దనున్న ఆలయంలో దుర్గమ్మను కూరగాయలతో అలంకరించిన దృశ్యం

అన్న ప్రసాదిని.. అభయ ప్రదాయిని

- శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

అగనంపూడి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు పలు ప్రాంతాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అగనంపూడి పోస్టాఫీసు వద్దనున్న దుర్గమాంబ ఆలయంలోని అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పాత అగనంపూడి నుంచి జాతీయ రహదారి కూడలి మీదుగా భక్తులు పలు రకాల పిండివంటలు, పండ్లను సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, చిత్తా కనకరాజు, సీహెచ్ రామారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదమడక కొండపై గల దుర్గాదేవి ఆలయంలో ధర్మకర్త బల్ల పైడిరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు జరిపారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86 వార్డు మాతృశ్రీ నగర్‌లో దుర్గాదేవిని ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి ఆధ్వర్యంలో శ్రీకాశీఅన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. పలువురు మహిళలు సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అలాగే 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని, డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మను, 87వ వార్డు కణితి గవరవీధిలోని శ్రీకనకదుర్గమ్మను శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.



తుంగ్లాంలో శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి



పెదగంట్యాడ కండిపిల్లివీధిలో అన్నపూర్ణగా పూజలందుకున్న విజయదుర్గాదేవి

పెదగంట్యాడ: గ్రేటర్ 75వ వార్డు కండిపిల్లివీధిలోని విజయదుర్గాదేవి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్తలు టి.దుర్యోధన, లక్ష్మి, కమిటీ అధ్యక్షుడు కె.రమణ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెదగంట్యాడ బీసీ రోడ్డులో, నెల్లిముక్కు రామాలయం ఆవరణలోని దుర్గాదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలోని శ్రీమహాదుర్గ అమ్మవారిని శ్రీఅన్నపూర్ణా దేవిగా, శ్రీమహాలక్ష్మిని శ్రీధైర్యలక్ష్మీదేవిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారిని శ్రీశారదామాతగా అలంకరించి ప్రధాన అర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తుంగ్లాం రామాలయం వద్ద దుర్గాదేవిని వివిధ రకాల కాయగూరలతో అలంకరించి పూజలు చేయగా, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అదేవిధంగా నాతయ్యపాలెం బంగారమ్మ ఆలయం వద్ద, అక్కిరెడ్డిపాలెంలోని దుర్గమ్మ లను శాకంబరిగా అలంకరించి పూజలు జరిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చరూ..

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి సాయిరామ్ నగర్‌లో మురుగు కాలువలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. మురుగు నీటితో నిండివున్న ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నందున ఎవరైనా దగ్గరకు వెళితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పలుమార్లు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడ నుంచి మార్చాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా వారు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సురక్షిత ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



మురుగు కాలువలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రత్యేక అలంకరణలో జగన్మాత

పెందుర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్ర శబరిమల అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో, ఉన్న దుర్గాదేవి ఆలయంలో, అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో ఉన్న పంచముఖ గాయత్రీదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే సప్తగిరినగర్‌లో ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో అమ్మవారు ధైర్యలక్ష్మీగా దర్శనమిచ్చారు. వెంకటాద్రి శిఖరం దిగువున ఉన్న మహాకామేశ్వరీ ద్వాదశ సహిత జ్యోతిర్లింగాలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని ఎస్‌ఆర్‌పురంలో ఉన్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. పెందుర్తి సాధూమఠం సమీపంలో దివంగత పీఠాధిపతి యద్దనపూడి అయ్యన్నపంతులు నెలకొల్పిన మహాకామేశ్వరీ పీఠంలో దసరా ఉత్సవాల్లో భాగంగా పీఠం యాగశాలలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో కనక భార్గవి మహాయజ్ఞం, రుద్రహోమం, వనదుర్గ హోమాలు నిర్వహించారు. పినగాడిలో నాగదుర్గాదేవి ఆలయంలో వైసీపీ నియోజకవర్గ నేత గండి రవికుమార్ హాజరై అన్నపూర్ణమాత అలంకరణలో ఉన్న దుర్గమ్మకు పూజలు చేసి అన్నసమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. చినముషిడివాడలో ఉన్న శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం పీఠం అధిష్ఠాన దేవత శారదా రాజస్వరూప రాజశ్యామల అమ్మవారిని కౌమారి రూపిణిగా అలంకరణ చేశారు. పీఠం యాగశాలలో రుత్వికులు శ్రీచక్రనవావరణార్చన, రాజశ్యామల సహిత చండీ యాగం శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. సాయంత్రం పీఠం ప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమార్చన సూవాసిని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర పాల్గొన్నారు.



ధైర్యలక్ష్మి అలంకరణలో అలివేలు మంగాదేవి



కౌమారి రూపిణి అలంకరణలో శారదామాత



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన మర్రిచెట్టులో దుర్గాదేవి, వినాయకుడు, శివుడు

రాజరాజేశ్వరీగా సాగరి గిరి దుర్గమ్మ

మల్కాపురం, (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గా అమ్మవారు బుధవారం రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రోజూ వేలసంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శించుకుంటున్నారు. అమ్మవారి విష్టత తెలుసుకుని కలకత్త నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. అలాగే సాధారణ రోజుల్లో కూడా ప్రత్యేక బస్సుల్లో ఈ ఆలయానికి రావడం గమనార్హం. వచ్చిన భక్తులకు నిత్యం అన్నదానం జరుగుతుంది.

పలు చోట్ల అన్నసమారాధనలు

వేపగుంట, ఎన్.ఎ.డి.జంక్షన్, (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట కృష్ణానగర్ దుర్గా మల్లేశ్వరాలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతన్నాయి. ఈ సందర్భంగా బుధవారం అమ్మవానిరి అన్నపూర్ణదేవిగా అలంకరించారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లతో చేసిన అలంకరణ భక్తును ఆకట్టుకుంది. ఉదయం నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు చేస్తున్నారు. మధ్యాహ్నం 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఇదే విధంగా వేపగుంట అప్పన్నపాలెంలో ఉన్న శ్రీభూలోకమాండ ఆలయంలో నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. అలాగే 90వ వార్డు బుచ్చిరాజుపాలెం పైడిమాంబ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమ పూజలు చేశారు. ముఖ్యంగా మర్రిచెట్టు తొరలో ఉన్న దుర్గాదేవి, వినాయకుడు, శివుడు చెట్ల ఆకులు వేలాడుతూ అందరిని ఆకర్షంచింది. మధ్యాహ్నం 1000 మందికి అన్నసంతర్పణ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయకమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

భద్రాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారాముల వారిని బుధవారం భక్తులు దర్శించుకున్నారు. కాగా రామయ్య ఉచిత నిత్యన్నదాన పథకానికి ఏపీలోని విశాఖపట్నం గాజువాక జగ్గమ్మ కాంప్లెక్సుకు చెందిన లలిత్ కిశోర్, రూపవాణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అన్నదానంకు సమర్పించారు. దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్ , టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న కిశోర్ రూపవాణి దంపతులు

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న టీడీపీ వార్డు అధ్యక్షుడు తిరుమలరావు

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ కొత్తరోడ్డు దగ్గర గణేశ్ నగర్‌లో రూ.16 లక్షలతో చేపట్టనున్న రోడ్డు కాలువ పనులకు టీడీపీ వార్డు అధ్యక్షుడు వై.తిరుమ లరావు బుధ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కాలనీల్లో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కా రానికి వెంటనే ఎమ్మెల్యే గణబాబు చొరవతో ఈ పనులు చేపడుతున్నట్టు తెలియజేశారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తు న్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ లో భాగంగా గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నదని జోన్-3 ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గోపాలపట్నం మెయిన్ రోడ్డు, శ్రీరామ్‌నగర్, ఉడా కాలనీ, ప్రశాంతినగర్, టైలర్స్ కాలనీ, రజకుల కాలనీ, సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సహకరించాలని కోరారు.



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

విశాఖ డెయిరీ రైతుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో జరిగిన అవినీతిపై చర్యలు చేపట్టడంతో పాటు పాల సేకరణ ధర పెంచాలని కోరుతూ డెయిరీ పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం షీలానగర్ వద్ద జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. బుధవారం షీలానగర్‌లో విశాఖ డెయిరీ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న సందర్భంగా అక్కడ నిరసన తెలిపేందుకు డెయిరీ పాల రైతులు తరలిరావడంతో వారిని గాజువాక పోలీసులు అడ్డుకున్నారు. జాతీయ రహదారి వద్ద నుంచి సర్వసభ్య సమావేశం జరుగుతున్న చోటకు ర్యాలీగా వెళ్లేందుకు రైతులు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో పాటు సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణతో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ విశాఖ డెయిరీలోని అవినీతిపై శాసనసభ కమిటీ వేసిన కూటమి ప్రభుత్వం.. ఆ తరువాత దర్యాప్తును విస్మరించడం శోచనీయమన్నారు. తక్షణమే డెయిరీలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేపట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. రైతుల పాల సేకరణ ధరను లీటరుకు పది రూపాయలు పెంచాలని, రైతులకు మూడు నెలలకు ఒకసారి బోనస్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు స్నేహితుల ఆర్థిక సాయం

గాజువాక, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తనతో కలిసి చదువుకున్న ఆటో డ్రైవర్ ఇబ్బందుల్లో ఉన్నట్టు తెలుసుకున్న సహచర విద్యార్థులు విద్యార్థులు రూ.65 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. గాజువాక హైస్కూల్‌లో 1990-91బ్యాచ్‌లో చదువుకున్న బీసీ రోడ్డు ప్రాంతానికి చెందిన కృష్ణ గత కొన్నేళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల తన ఆటో ప్రమాదానికి గురవ్వడంతో కృష్ణ దిక్కుతోచని స్థితిలో ఉన్నట్టు తెలుసుకున్న స్నేహితులు అండగా నిలిచారు. ఈ మేరకు రూ.65 వేలను సేకరించి ఆటో మరమ్మతుల నిమిత్తం తమ స్నేహితుడైక కృష్ణకు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు చేతుల మీదుగా అందజేశారు.

'గొన్నా'లో హ్యాక్‌థాన్ పోటీలు

అగనంపూడి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెంలో గల గొన్నా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను గొన్నా విద్యా సంస్థల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవడంతో పాటు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రాణించాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ పూర్ణ, ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చురుగ్గా బీటీ రోడ్ల ఆధునికీకరణ పనులు

పెదగంట్యాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో పలు బీటీ రోడ్ల ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.80 లక్షల అంచనా వ్యయంతో ఈ రోడ్లను బాగు చేస్తున్నారు. సిద్ధేశ్వరం జంక్షన్ నుంచి ముసలినాయుడు పాలెం వరకు, ముసలినాయుడు పాలెం నుంచి పెంటమాంబ ఆలయం వరకు, దుర్గవానిపాలెం శివాలయం కూడలి నుంచి పెదగంట్యాడ వీహెచ్‌సీ జంక్షన్ వరకు, బాలచెరువు కూడలి నుంచి నడుపూరు గెడ్డ వరకు ఆయా రోడ్ల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఆయా పనులను కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకట రమణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

ఉద్రిక్తంగా 'ఆపరేషన్ లంగ్స్'

- ఎక్స్‌కవేటర్‌కు అడ్డంగా పడుకుని దుకాణదారుల నిరసన
- చిరు వర్తకులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తాం: మేయర్ పీలా శ్రీనివాసరావు
- హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ నాయకులు



పెందుర్తి రైతుబజార్ వద్ద ఆక్రమణలు తొలిగిస్తున్న దృశ్యం

పెందుర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించేందుకు జీవీఎంసీ విస్తృత స్థాయిలో చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్'లో భాగంగా బుధవారం స్థానిక రైతుబజార్ రోడ్డులో ఉన్న దుకాణాలను జోన్8 అధికారులు తొలగించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే జడ్సీ శంకరరావు పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ అధికారులు చినముషిడివాడ నుంచి పెందుర్తి వరకు ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపునకు చర్యలు చేపట్టారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దుకాణాలను తొలగించడాన్ని దుకాణదారులు తీవ్రంగా వ్యతిరేకించారు. రైతుబజార్ గేటు ముందు ఉన్న స్థలంలో దశాబ్దాల తరబడి ఉన్న దుకాణాలను ఏవిధంగా తొలగిస్తారని వామపక్షాల నేతల మద్దతుతో ఎక్స్‌కవేటర్ మీదకు ఎక్కి వాగ్వివాదానికి దిగారు. తమను తొక్కించుకుంటూ వెళ్లి దుకాణాలను తొలగించాలని ఆందోళన చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దుకాణదారులు, వామపక్షాల నేతలు భోజనానికి వెళ్లడంతో, జడ్సీ శంకరరావు చొరవ తీసుకుని అధిక సంఖ్యలో పోలీసుల బలగాలను తెప్పించి దుకాణాల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకుని ఘటనాస్థలానికి దుకాణదారులు చేరుకున్నారు. రేప్ సాయంతో వారిని అడ్డుకుని తొలగింపు చర్యలను సాగించారు.

అనంతరం రైతుబజార్‌లో దుకాణదారులు పెందుర్తిలో ఉన్న నగర మేయరు పీలా శ్రీనివాసరావు ఇంటికి తరలివెళ్లారు. తమ సమస్యను పీలాకు వివరించుకున్నారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల ముసుగులో అక్రమార్కులు వ్యాపారాలు చేస్తున్నారని, వారిని అడ్డుకునేందుకే ఈ తొలగింపులు చేస్తున్నామన్నారు. చిరు వర్తకులకు ఇబ్బంది కలగకుండా హాకర్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

న్యాయం జరగకపోతే కార్పొరేటర్ల ఇళ్లను ముట్టడిస్తాం

వేపగుంట, (ఆంధ్రజ్యోతి): జోన్ 8 పరిధి 89 నుంచి 98 వార్డులకు సంబంధించిన చిరు వర్తకులు ఏఐటీయూసీ, సీఐటీయూ, జోన్ 8 సంఘాల ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కొంతమంది జోనల్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి తమ వ్యాపారాలు అక్కడే నిర్వహించుకునేలా చూడాలని ప్లకారుడలు ప్రదర్శిం చారు. ఆ సమయంలో జడ్సీ లేకపోవడంతో ఇన్‌చార్జి సూపరిండెంటెంట్ నాయుడు వినతి పత్రాన్ని తీసుకుని జడ్సీతో మాట్లాడిస్తానని హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చిరు వర్తకులను న్యాయం జరగకపోతే ఆయా వార్డు కార్పొరేటర్ల ఇళ్లను ముట్టడిస్తామని నాయకులు హెచ్చరించారు. సాయంత్రం జడ్సీ శంకరరావును ఏఐటీయూసీ నాయకుల కలిసి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాస్, సీపీఎం నాయకులు రమణి, జగన్, సీఐటీయూనగర కార్యవర్గ సభ్యుడు పి.వెంకటరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కో ఆర్డినేటర్ జి.గ్రేస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీపీఎస్ (క్లర్క్, ప్రొబేషనరీ ఆఫీసర్), ఆర్ఆర్‌బీ (ఆఫీసర్ స్కేల్ 2, 3, ఆఫీస్ అసిస్టెంట్), ఎస్ఎస్‌సి (సీజీఎల్, టియర్-2) వంటి పోటీ పరీక్షల టైర్ 2/మెయిన్ పరీక్షలకు ఉచిత వసతి సౌకర్యంతో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా డిగ్రీ చేసి, టైర్-1 ప్రిలిమినరీ పరీక్ష రాసి ఉండాలి. ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవారూ అర్హులే. ఎస్సీ, ఎస్టీ కుటుంబ వార్షికాదాయం రూ.6లక్షల లోపు ఉండాలి. తిరుపతి, విశాఖపట్నం స్టడీ సర్కిల్స్‌లో 80 మంది చొప్పున 60 రోజుల శిక్షణ ఉంటుంది. మ్యాథమెటికల్ ఎబిలిటీస్, రీజనింగ్ (వర్బల్, నాన్ వర్బల్), ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్స్, డిస్క్రిప్టివ్ ఇంగ్లీష్ (ఐబీపీఎస్ పీవో మెయిన్స్‌కు మాత్రమే), జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ ప్రొఫెషియన్సీ, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ డాటా ఇంటర్‌ప్రిటేషన్. ఈనెల 24 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. అక్టోబరు ఆరో తేదీలోగా సమర్పించాల్సి ఉంటుంది. అక్టోబరు 12న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. అదేనెల 22 నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. కుల, ఆదాయ, విద్యార్హత ధ్రువపత్రాలు, ఫొటో, టియర్ - 1 పరీక్ష వివరాలతో దరఖాస్తులను ఏపీఎస్‌టీడీసీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో అప్‌లోడ్ చేయాలి. హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. వివరాలకు ఎంవీపీ కాలనీ, అనకాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కార్యాలయం లేదా జిల్లా కో ఆర్డినేటర్‌ను 9440280275, 7658945570 నంబర్లలో సంప్రతించాలి.

ఆక్రమణల తొలగింపు తక్షణమే ఆపాలి

▸ మానవ హక్కుల వేదిక డిమాండ్

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో వీధి వ్యాపారులను ఆక్రమణల పేరిట బలవంతంగా ఖాళీ చేయించడాన్ని తక్షణమే ఆపాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ప్రతినిధులు ఎం.శరత్, కె.అనూరాధ, వీఎస్ కృష్ణలు బుధవారం ప్రకటన విడుదల చేశారు. స్ట్రీట్ వెండర్స్ చట్టం, 2014ను ఉల్లంఘించడమేనని ఆరోపించారు. నగరంలో 2,850కి పైగా దుకాణాలను, బండ్లను తొలగించారని, ఇవి కొనసాగుతున్నాయన్నారు. దీనవల్ల వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, మౌఖిక నోటీసులతో తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. హింసాత్మకంగా తరిమివేయడం, సరకులు స్వాధీనంతో వారి ఆత్మగౌరవం దెబ్బతింటోందన్నారు. వీధి వ్యాపారుల తొలగింపు అక్రమమన్నారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించి,స్వాధీనం చేసుకున్న సరకులను తిరిగివ్వాలని, చట్ట ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ ఇవ్వనున్నారు. ఇందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అక్టోబరు 12లోగా తమ పేర్లను ఏపీఅప్రెంటీస్‌షిప్‌ఇండియా.జీవోవీ.ఇన్‌లో నమోదుచేసుకోవాలి. తూర్పుగోదావరి డీజిల్, మోటారు మెకానిక్, కాకినాడ జిల్లాలో డీజిల్, మోటారు మెకానిక్, వెల్డర్, కోనసీమ జిల్లాలో డీజిల్, మోటారు మెకానిక్, వెల్డర్, విశాఖ జిల్లాలో డీజిల్, మోటారు మెకానిక్, పెయింటర్, అనకాపల్లి జిల్లాలో డీజిల్, మోటారు మెకానిక్, విజయనగరం జిల్లాలో షీట్‌మెటల్ వర్కర్, పెయింటర్, పార్వతీపురం మన్యం జిల్లాలో డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, శ్రీకాకుళం జిల్లాలో డీజిల్, మోటారు మెకానిక్ ట్రేడ్లలో ఖాళీలున్నాయి. విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు అక్టోబరు 13న, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల వారికి 14న, విశాఖ, అనకాపల్లి జిల్లాల వారికి 15న, శ్రీకాకుళం వారికి 16న విజయనగరంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది. ఒరిజనల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జెరాక్స్‌లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కోరారు.

తత్వశాస్త్ర కోవిదుడు సచ్చిదానందమూర్తి

▸ ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు



వేదిక భగవద్గీత భాష్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, చిత్రంలో విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఏయూ వీసీ రాజశేఖర్ తదితరులున్నారు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆధునిక భారతదేశంలోని తత్వశాస్త్ర కోవిదుల్లో ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తిది ప్రత్యేక స్థానమని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బీఆర్ అంబేద్కర్ అసెంబ్లీహాల్‌లో బుధవారం నిర్వహించిన ఐసీపీఆర్ అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలాసఫికల్ లెగసీ ఆఫ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి అనే అంశంపై మూడు రోజుల పాటు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హరిబాబు ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటుచేసిన ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సచ్చిదానందమూర్తి రచనలు, పరిశోధనలు నిరంతరం చైతన్యపరుస్తాయన్నారు. తన జీవితాన్ని బోధన, పరిశోధనకు అంకితం చేశారన్నారు. తత్వశాస్త్రం నైతిక విలువలు, విద్య, సమాజం, శాంతికి అనుసంధానమై ఉంటుంద న్నారు. భారతీయ తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేయడంతో పాటు పాశ్చాత్య దృక్పథాలను స్వీకరించేవారన్నారు. విద్యా రంగంలో ఉన్నత నాయకునిగా నిలిచారని, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా, యూజీసీ వైస్ చైర్మన్‌గా ఆయన సేవలు అజరామరమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించిన సందర్భాలను గుర్తుచేశారు. భారతీయ ఆధ్యాత్మిక సంపదను అందరికీ చేరువ చేయాలని ఆశించేవారన్నారు. విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సచ్చిదానంద మూర్తితో తన అనుబంధాన్ని పంచుకున్నారు. ఆయన వద్ద వినమ్రతతో కూడిన ఆత్మవిశ్వాసం కనిపించేదన్నారు. విద్యార్థి, అధ్యాపకుడు కలిసి సత్యాన్వేషణ చేయాలని సూచించే వారన్నారు. సదస్సును ఉద్దేశించి మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పంపిన సందేశాన్ని యార్లగడ్డ చదివి వినిపించారు. మహోన్నత శిఖరంగా సచ్చిదానందమూర్తి నిలుస్తారని వెంకయ్యనా యుడు పేర్కొన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ తత్వశాస్త్ర విభాగంలో శిఖరాయమానంగా సచ్చిదానందమూర్తి నిలుస్తారన్నారు. అపార జ్ఞానాన్ని వర్సిటీ అభివృద్ధికి, సమాజ వికాసానికి వినియోగించారన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, తత్వశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రమేష్ బాబు, ప్రొఫెసర్ అరిందం చక్రవర్తి, ఐసీపీఆర్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ సచ్చిదానంద మిశ్రా తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా వేదిక భగవద్గీత భాష్యం పుస్తకాన్ని గవర్నర్ హరిబాబు ఆవిష్కరించారు. తొలి సంచికను సచ్చిదానందమూర్తి కుమారుడు రమేష్‌కు అందించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, పూర్వ ప్రొఫెసర్ బి.ప్రసాదరావు, వి.బాల మోహన్‌దాస్, ఎ.ప్రసన్నకుమార్, పి.జార్జ్‌విక్టర్, అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి కేఆర్ రజని, మాజీ డీజీపీ కె.అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు: ఎంపీ శ్రీభరత్


సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్, తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ నైపుణ్యంతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బుధవారం 31వ ఎన్ఎన్ఏఐ-2025 రాష్ట్రస్థాయి ద్వైవార్షిక సదస్సు ప్రారంభమైంది. ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ ప్రాంతీయ శాఖ లెర్నింగ్ టు డే లీడింగ్ టుమారో ద జర్నీ ఆఫ్ ఏ నర్సింగ్ స్టూడెంట్ అనే అంశంపై సదస్సును నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సదస్సులో మాట్లాడుతూ విద్య మెరుగైన అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఉపాధికి అవసరమైన నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. వైద్య రంగంలో నర్సింగ్ వ్యవస్థ కీలకమన్నారు. ఇండియన్ రెసిటేషన్ ఫెడరేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సౌత్ రీజియన్) ఉపాధ్యక్షురాలు డాక్టర్ బి.వల్లి మాట్లాడుతూ విద్యార్థులు పూర్తి సమయాన్ని కెరియర్‌కే కేటాయించాలన్నారు. టీఎన్ఏఐ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సీఆర్ షంషీర్ బేగం సదస్సు ప్రాధాన్యతలు, ప్రత్యేకతలను వివరించారు. ఏపీ శాఖ కార్యదర్శి, ప్రొఫెసర్ కె.సుశీల కార్యక్రమం స్ఫూర్తిదాయకమన్నారు. నర్సింగ్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి ప్రత్యక్ష సామర్థ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నర్సింగ్ పూర్తిచేసిన తరువాత బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్ఏఐ ఏపీ శాఖ సలహాదారులు డాక్టర్ ఎం.సత్యవల్లి, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ ప్రీతం లూక్స్, కో-చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వి జ్యూవెలరీ మార్ట్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ వ్యాపార వేత్త పి.సర్వేశ్వరరావు

సీతమ్మధార, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆశీల్‌మెట్ట సంపత్ వినాయక ఆలయ సమీపంలో వి జ్యూవెలరీ మార్ట్ రెండో షో రూమును శ్రీకావ్య ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కేఎన్‌వీఎస్ గురుమూర్తి బుధవారం ప్రారంభించారు. ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య మేనేజింగ్ డైరెక్టర్ కె.గురుమూర్తి మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా విజ్యూవలరీ మార్ట్ భాగస్వాములు కోలా బాబూరావు, కాకి గంగరాజు, పట్నాల శ్రీనివాసరావు, పూనా వినిత్‌లు మాట్లాడుతూ నగరంలో రెండో షోరూమును మెయిన్ రోడ్డుకు దగ్గరగా, వినియోగదారులకు అనుకూలంగా ఏర్పాటు చేశామన్నారు. విన్నూత కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల 22 కేరట్ల బంగారు ఆభరణాలను మార్కెట్ ధర ఎక్కువగా ఉన్నప్పటికీ గ్రాము రూ.9,987కే అందిస్తున్నామన్నారు. ఆభరణాలపై తరుగు 6.96 శాతం నుంచి పొందవచ్చన్నారు. అదే విధంగా సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, వినియోగదారుల తరఫున జీఎస్టీ కూడా తామే చెల్లిస్తామన్నారు. వెండి వస్తువుల కొనుగోలుపై కేజీకి రూ.15 వేల వరకు తగ్గింపు లభిస్తుందన్నారు. ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ షోరూమ్‌కి విచ్చేసి ప్రత్యేక డిజైనరీ కలక్షన్లు ఎంపిక చేసుకొని ఆఫర్‌ని వినియోగించుకోవాలని కోరారు.

విజయవాడలో కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు 35వ శాఖ ప్రారంభం


బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని అక్కయ్యపాలెం కేంద్రంగా ఏర్పడిన 'ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్' 35వ శాఖను ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సత్యనారాయణపురంలో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార బ్యాంకుల పాత్ర కీలకమన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రజలకు ఉత్తమ సేవలందించాలన్నారు. మాజీ మంత్రి, కృష్ణా జిల్లా డీసీసీబీ చైర్మన్ నెట్టెం శ్రీరఘురాం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 35 శాఖలు ఉన్నాయన్నారు. రూ.1,064 కోట్ల డిపాజిట్లు, రూ.696 కోట్ల రుణాల మంజూరుతో రూ.1,760 కోట్ల వ్యాపారం సాగిస్తోందన్నారు. సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో గన్నవరం, విశాఖలోని షీలానగర్, వన్‌టౌన్ శాఖలను ప్రారంభిస్తామన్నారు. బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిశోర్, ఏజీఎంలు పి.వీరభద్రరావు, జాస్తి మురళి, సత్యనారాయణపురం శాఖ మేనేజర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరికి చేరిన ఆలిండియా స్కేటింగ్ యాత్ర


ఘాట్‌రోడ్డు వద్ద అజేయ్‌కుమార్ విశ్వకర్మ

సింహాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా స్కేటింగ్ యాత్ర చేస్తున్న అజేయ్‌కుమార్ విశ్వకర్మ బుధవారం సింహగిరికి చేరుకున్నారు. జార్ఖండ్‌లోని బీజాపూర్‌లో 33 రోజుల కిందట బయలుదేరి ఇతడు రోజుకు 70 కిలోమీటర్లు స్కేటింగ్ చేస్తున్నట్టు తెలిపాడు. రాత్రి సమయంలో దేవాలయాల వద్ద విశ్రాంతి తీసుకుంటూ ఆలయాల్లో ప్రసాదాలను ఆహారంగా తీసుకుంటున్నానన్నాడు. తన మార్గంలో ప్రధానమైన హిందూ దేవాలయాలన్నింటిని దర్శించుకుంటున్నాని, ఇది ఎంతో ఆనందాన్నిస్తోందని తెలిపాడు.

వ్యాధి నిరోధక టీకాలు వేయడం తప్పనిసరి

▸ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి లూసీ కార్డిలియో


పట్టణ ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఐవో డాక్టర్ లూసీ

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా చిన్నారులకు అందించాలని, నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లూసీ కార్డిలియో పేర్కొన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం వన్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ప్రోగ్రామ్ అమలు, కోల్ చైన్ నిర్వహణ, టీకా నిల్వలు, అభా ఐడీల విధానం, అనీమియా ముక్తభారత్ అమలు, గర్భిణులకు ల్యాబ్ సేవలను అందిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవల తీరును తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యం మేరకు పనిచేయాలని, మహిళలకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

పెందుర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సిటీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. ఈ సంఘటన మండలంలోని అప్పన్నపాలెం వద్ద బుధవారం జరిగింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. వేపగుంట వరలక్ష్మీనగర్‌కు చెందిన గన్నవరపు వెంకటభాస్కర్ (58) పెందుర్తి వచ్చేందుకు సిటీ బస్సు ఎక్కాడు. బస్సు అప్పన్నపాలెం వద్దకు చేరుకునే సరికి గుండెపోటు రావడంతో కూర్చున్న సీటులోనే మృతిచెందాడు. గమనించిన ప్రయాణికులు 108 వాహనానికి కాల్ చేయడంతో వారు వచ్చి సీఆర్ చేసి, పెందుర్తి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

పెందుర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు సకాలంతో స్పందించి కాపాడారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. పెందుర్తి వెలంపేటలో నివసిస్తున్న యువకుడు (24)కి ఏడాది కిందట వివాహమయింది. దంపతుల మధ్య చిన్న విషయాలకే తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజామున మరోసారి గొడవ జరగడంతో ఆత్మహత్య చేసుకుంటానంటూ యువకుడు ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన భార్య డయల్ 112కు ఫోన్ చేయడంతో పెందుర్తి పీసీలు సతీశ్, రామానాయుడు బాధితుడి సెల్‌ఫోన్ సిగ్నల్స్ అధారంగా పెందుర్తి రైల్వే ట్రాక్‌పై ఉన్నాడని తెలుసుకుని, పట్టాలపై పడుకుని ఉన్న అతడిని కాపాడారు. అనంతరం స్టేషన్‌లో దంపతులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పద నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదుతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు, సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్లో భారీగా నగదు రవాణా చేస్తున్న అనుమానిత వ్యక్తులను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.43 లక్షు స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు భారీగా నగదు రవాణా చేస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఒడిశాలోని కంటాబంజి ఇటుక ఫ్యాక్టరీలో పనిచేసేందుకు ముందుకు వచ్చిన కూలీలకు అడ్వాన్స్ ఇచ్చేందుకు తీసుకువెళుతున్నామని చెప్పారు. అయితే తగిన పత్రాలు చూపలేకపోవడంతో నగదుతోపాటు అదుపులోకి తీసుకున్న ముగ్గురిని మహారాణిపేట, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామని రైల్వే పోలీసులు తెలిపారు.

విశాఖ డెయిరీ నికర లాభం రూ.8.51 కోట్లు

▸ ప్రకటించిన చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత ఆర్థిక సంవత్సరంలో విశాఖ డెయిరీ రూ.1,755 కోట్ల టర్నోవర్‌తో రూ.8.51 కోట్ల నికర లాభం ఆర్జించిందని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రకటించారు. షీలానగర్‌లో బుధవారం జరిగిన డెయిరీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 19.28 కోట్ల లీటర్ల పాలు, 5.84 కోట్ల కిలోల పెరుగు విక్రయించామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించి రూ. 20 కోట్ల నికరలాభం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీఎస్టీ తగ్గింపుతో సుమారు వందకు పైగా ఉత్పత్తులపై ధరలు తగ్గించామన్నారు. ఈ సమావేశంలో పలువురు డైరెక్టర్‌లు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

27న మరో అమృతభారత్ రైలు ప్రారంభం

▸ బ్రహ్మపుర నుంచి విజయనగరం మీదుగా సూరత్‌కు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మీదుగా బ్రహ్మపుర-సూరత్ (ఉద్నా) మధ్య ప్రవేశపెట్టనున్న కొత్త అమృతభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 27న పట్టాలెక్కనుంది. ఒడిశా, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను అనుసంధానిస్తూ ఖనిజ, వస్త్ర, పారిశ్రామిక, వ్యాపార కేంద్రాలకు చెందిన వివిధ జిల్లాలను కలుపుతూ నడిచే ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. 09022 నంబరు గల ఎక్స్‌ప్రెస్ 27న మధ్యాహ్నం 12 గంటలకు బ్రహ్మపురలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 9 గంటలకు సూరత్ చేరుతుంది. 19021, 19022 నంబర్లతో శాశ్వత ప్రాతిపదికన అందుబాటులోకి రానున్న సర్వీసులను సూరత్ నుంచి అధికారికంగా నడపనున్నారు.

ఈఎస్ఐ మెడికల్ కాలేజీకి భూమి కేటాయించండి

▸ అసెంబ్లీలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న 500 పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాల్సి ఉందని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమి కేటాయించాలని బుధవారం అసెంబ్లీలో కోరారు. దీనివల్ల ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అదే విధంగా 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన విమ్స్‌కు కూడా ఎయిమ్స్ వంటి సంస్థను అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రెండింటిపైనా ప్రభుత్వం, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు.

ఘోషాలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట

▸ సీఎస్ఆర్ నిధులు అందించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

▸ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ఉష


ఘోష ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ఉష

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఘోషా ఆస్పత్రిలో సీఎస్ఆర్ నిధులు రూ.1.3 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ఉష తెలిపారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చొరవ తీసుకుని రూ.35 లక్షలు సీఎస్ఆర్ నిధులు అందించడం తో గర్భిణులు, బాలింతలకు ఏసీ వెయింట్‌రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. 20 పడకలతో హైరిస్క్ వార్డు అందుబాటులోకి వచ్చిందన్నారు. రూ.12 లక్షలతో ల్యాబ్‌కు అవసరమైన పరికరాలు కొనుగోలు చేశామన్నారు. దీంతో సీబీపీ, ఎల్ఎఫ్‌టీ, రీనల్ ఫంక్షనింగ్ వంటి పరీక్షలు చేయడం సులభమవుతోందన్నారు. ఫార్మసీ షెడ్డు ఏర్పాటు చేయించామని, చిల్డ్రన్ ఓపీ ఆధునికీకరించామన్నారు. కొత్తగా మెటర్నిటీ ఓటీ నిర్మించామన్నారు. హైరిస్క్ వార్డు, ల్యాబ్‌లు, ఓపీతోపాటు అనేకచోట్ల 20 ఏసీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ 300 మంది గర్భిణులు ఓపీ సేవలు పొందుతున్నారని, రోజూ 10 నుంచి 15 ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అత్యాధునిక ల్యాప్రోస్కోపీ పరికరాలను రూ.35 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినట్టు తెలిపారు. 250 కేవీ జనరేటర్, సోలార్ ప్లాంట్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి సదుపాయాలను అందుబాటులోకి వచ్చాయన్నారు. లిఫ్టులు లేకపోవడంతో బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారని, ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటైతే, కొన్ని కేటగిరీల నిపుణులు అందుబాటులోకి వస్తారన్నారు.